RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 24 శనివారం, ఫిబ్రవరి 17, 2024 పేజీలు : 4

## ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను సర్కారు నియమించింది. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా ఎం.రమేశ్, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, నెహ్రూ నాయక్ మాలోత్‌ను నియమిస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. సిరిసిల్ల రాజయ్య వరంగల్ (ఎస్సీ) పార్లమెంట్ స్థానం నుంచి 15వ లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

### కులగణన తీర్మానం...

# చరిత్రాత్మకం

**హైదరాబాద్ ఫిబ్రవరి, 16 :** తెలంగాణ అసెంబ్లీలో కులగణన తీర్మానం చరిత్రాత్మకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీలో కులగణన తీర్మానంపై చర్చ సందర్భంగా భట్టి మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం సంపద పంచాలని సూచించారు. తెలంగాణలో అన్ని కులాలను గణన చేస్తామని, కులగణనతో పాటు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సర్వే చేస్తామని వివరించారు. సర్వేలో అన్ని వివరాలు పొందుపరుస్తామని, అసెంబ్లీ ఎన్నికల్లో కులగణనపై హామీ ఇచ్చామని, అమలు చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.
సర్వే అనేది సర్వరోగ నివారిణిలా ఉంటుందని చెప్పారు.



### బలహీనవర్గాల కోసమే...

# కులగణన

**హైదరాబాద్ ఫిబ్రవరి, 16 :** హైదరాబాద్: బలహీనవర్గాలను బలోపేతం చేసేందుకే కులగణన చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఏ సామాజిక వర్గానికి చెందినవారు ఎంతమంది ఉన్నారు, వారి ఆర్థిక పరిస్థితి ఏమిటి, ఆయా సామాజిక వర్గాలలో ఆర్థిక, విద్య, ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయనే పూర్తి వివరాలతో ఈ సర్వే నిర్వహిస్తామన్నారు. అసెంబ్లీలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కులగణన జరిగితే బలహీనవర్గాలకు మరింత ప్రయోజనకరంగా సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చని అన్నారు. కేసీఆర్ పదేళ్ల క్రితం జరిపిన సామాజిక కుటుంబ సర్వే వివరాలను ఇప్పటికీ బయటపెట్టలేదనీ, పదేళ్లుగా దాచుకున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. కులగణనపై తీర్మానం చేస్తున్న సమయంలోనూ కేసీఆర్ సభకు రాకపోవడం విచారకరమన్నారు. కులగణనపై



ప్రజలలో అనుమానాలు లేవనెత్తేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. కులగణన తీర్మానంపై అనుమానం ఉంటే ప్రతిపక్షాలు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# 9,750 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు



**డిల్లి (గరుడ వార్త) :** హరియాణా లోని రేవాడీ లో 9,750 కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన అనేక అభివృద్ధి ప్రాజెక్టుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న ప్రారంభోత్సవం, దేశ ప్రజల కు అంకితం ఇవ్వడం లతో పాటు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు పట్టణ ప్రాంతాల లో రవాణా, ఆరోగ్యం, రైలు మార్గాలు మరియు పర్యటన ల వంటి అనేక ముఖ్యమైన రంగాల కు చెందినవి. ఈ సందర్భం లో ఏర్పాటు చేసిన కొన్ని ఎగ్జిబిశన్ లను కూడా శ్రీ నరేంద్ర మోదీ కలియదిరిగి పరిశీలించారు. సభను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ధైర్యవంతుల పురిటిగడ్డ రేవాడీ కి ప్రశంస ను వ్యక్తం చేస్తూ, ఈ ప్రాంతం లో తన పట్ల ప్రజలు చూపిన ఆప్యాయత ను గుర్తు కు తెచ్చారు. 2013 వ సంవత్సరం లో ప్రధాని అభ్యర్థి గా తన తొలి కార్యక్రమం రేవాడీ లోనే జరిగిన సంగతి ని ఆయన గుర్తు కు తెచ్చుకొంటూ, ప్రజలు అందించిన శుభాకాంక్షల ను స్మరించుకొన్నారు. ప్రజల ఆశీస్సులే తనకు ఒక పెద్ద ఆస్తి అని ఆయన అన్నారు. ప్రపంచం లో నూతన శిఖరాల కు భారతదేశం చేరుకొంటోంది అంటే దానికి సంబంధించిన ఖ్యాతి ప్రజల దీవెనలదే అన్నారు. యుఎఇ ని మరియు కతర్ ను ప్రధాన మంత్రి తాను సందర్శించిన విషయమై మాట్లాడుతూ, ప్రపంచ రంగస్థలం లో భారతదేశాని కి లభిస్తున్నటువంటి గౌరవం మరియు సద్భావన ల ఖ్యాతి భారతదేశ ప్రజలకే దక్కుతుంది అని స్పష్టం చేశారు. అదే విధం గా జి-20, చంద్రయాన్ మరియు భారతదేశ ఆర్థిక వ్యవస్థ పదకొండో స్థానం నుండి అయిదో స్థానాని కి ఎగబాకడం.. ఇవన్నీ ప్రజల సమర్థన చలవే నన్నారు. రాబోయే సంవత్సరాల లో భారతదేశాన్ని ప్రపంచం లో మూడో అతి పెద్దదైనటువంటి ఆర్థిక వ్యవస్థ గా మలచడానికి ప్రజలు వారి యొక్క ఆశీస్సుల ను అందించాలి అని ఆయన కోరారు.

### సోనియా గాంధీ ఆస్తుల విలువ రూ.12 కోట్లు..


# సొంత కారు లేదు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆస్తుల విలువ రూ.12 కోట్లు. ఆమెకు సొంత కారు లేదు. తొలిసారి రాజ్యసభకు నామినేషన్ వేసిన సోనియా గాంధీ తన ఆస్తులు, ఇతర వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మొత్తం ఆస్తులు రూ.12.53 కోట్లుగా ప్రకటించారు. ఇటలీలోని తండ్రి ఇంటి ఆస్తిలో వాటా విలువ రూ.27 లక్షలని తెలిపారు. అలాగే 88 కేజీల వెండి, 1,267 గ్రాముల బంగారం, ఆభరణాలు ఉన్నాయన్నారు. ఢిల్లీలోని డేరా మండి గ్రామంలో వ్యవసాయ భూమి ఉన్నట్లు తెలిపారు. ఎంపీ జీతం, రాయల్టీ ఆదాయం, మూలధన లాభాలు వంటివి తన ఆదాయమని చెప్పారు. తన వద్ద రూ.90,000 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. 2019 నాటి ఎన్నికల అఫిడవిట్‌లో మొత్తం ఆస్తుల విలువ రూ.11.82 కోట్లుగా ఆమె వెల్లడించారు. కాగా, ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న విద్యార్హతల ప్రకారం సోనియా గాంధీ 1964లో సియానాలోని ఇస్టిటుటో శాంటా థెరిసాలో ఇంగ్లీష్, ఫ్రెంచ్‌లో మూడు సంవత్సరాల విదేశీ భాషల కోర్సు పూర్తి చేశారు. 1965లో కేంబ్రిడ్జ్‌లోని లెనాక్స్ కుక్ స్కూల్‌లో ఇంగ్లీష్‌లో సర్టిఫికేట్ కోర్సు చేశారు. సోనియా గాంధీకి వ్యక్తిగతంగా కారు లేదు. అలాగే సోషల్ మీడియా ఖాతా కూడా లేదు.

### ఉచిత విద్యుత్‌పై తెలంగాణ సర్కార్

# కీలక ప్రకటన



**హైదరాబాద్ ఫిబ్రవరి, 16 :** తెలంగాణలో ఉచిత విద్యుత్ పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది.క్షేత్ర స్థాయిలో అర్హులను గుర్తించేందుకు వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. తాజాగా గృహ జ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లు ఫ్రీ కరెంట్ పొందాలనుకునే వారికి సర్కారు కీలక సూచనలు చేసింది. వారు ఆధార్ కలిగి ఉన్నట్లు ప్రూఫ్ చూపించాల్సి ఉంటుందని లేకపోతే ఆధార్ అథెంటిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని పెర్కొంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో గృహజ్యోతి పథకం అమలుపై కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే ప్రాజెక్టుల అమలుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా హామీ పథకాల్లో అత్యంత ప్రధానమైన గృహజ్యోతి యోజనను అమలు చేసింది. ప్రస్తుతం అద్దె ఇళ్లలో ఉండేవారికి ప్రయోజనం చేకూర్చేలా ఇంధన శాఖ గృహజ్యోతి పథకంలో మార్పులు చేసింది. అద్దె ఇళ్లలో ఉండేవారు.. మొదట ఓ ఇంటి పేరు మీద పథకం పొందుతూ.. కొన్ని నెలల తర్వాత, వారు వేరే ఇంటికి మారితే, అప్పుడు కూడా వారు ఈ పథకాన్ని పొందేలా మార్పులు చేసింది. ఇప్పటివరకూ ఇల్లు మారిన వారు ఈ పథకాన్ని పొందాలంటే ఏం చేయాలనే ప్రశ్న ఉండేది. ఈ గందరగోళానికి విద్యుత్ శాఖ తెరదించింది. రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఈ పథకం అమలుపై ఇప్పటికే కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. గృహ జ్యోతి పథకం అమలుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఉచిత విద్యుత్ గృహ జ్యోతి పథకానికి బడ్జెట్ లో రూ.2,418 కోట్లు కేటాయించామన్నారు. విద్యుత్ సంస్థలు ట్రాన్స్ కో, డిస్కమ్ లకు రూ.16,825 కోట్లు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

### కాంగ్రెస్ హయాంలో రైతులకు...

# బ్యాంకుల మొండిచేయి

న్యూఢిల్లీ: కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత సహా పలు డిమాండ్లపై రైతులు తమ ఆందోళనను ఉధృతం చేస్తుండగా రైతులపై ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు లాభం చేకూర్చే పథకాలపై కసరత్తు సాగిస్తోందని అన్నారు. హరియాణలోని రెవారిలో ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం మోదీ బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో అంతకుముందు పదేండ్ల యూపీఏ హయాంలో రైతులకు చేసిందేమీ లేదని మోదీ దుయ్యబట్టారు. గతంలో రైతులకు రుణాలిచ్చేవారు కాదని, అలాంటిది కేంద్రం రైతులకు బ్యాంకు లోన్లు అందేలా గ్యారంటీ కల్పించిందని అన్నారు. రైతులకు తాము మోదీ గ్యారంటీ కల్పించామని, బ్యాంకులు అన్నదాతలకు గతంలో రుణాలిచ్చేవి కాదని, కానీ తాము రైతులకు గ్యారంటీ ఇచ్చామని మోదీ వివరించారు.



### ఢిల్లీకి సూట్‌కేసులు మోస్తున్న కాంగ్రెస్..

# కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు

**హైదరాబాద్ ఫిబ్రవరి, 16 :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కనపెట్టి ఢిల్లీకి సూట్ కేసులు మోస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాహుల్ గాంధీ కోసం కాంట్రాక్టర్లను, బిల్డర్లను, కంపెనీలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నదన్నారు. వైసీపీ నాయకుడు వెల్లల రామ్మోహన్ తన అనుచరులతో కలిసి శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కర్నాటక నుంచి సూట్ కేసులు వస్తే.. ఇప్పుడు తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతాయి కానీ.. ఆరు గ్యారంటీలు మాత్రం అమలు చేయడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం చేసేదే చెప్తుంది.. చెప్పేది చేస్తుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన పీవీ నర్సింహారావును కాంగ్రెస్ అవమానిస్తే, మోదీ ప్రభుత్వం గౌరవించిందన్నారు. తొమ్మిదన్నరేండ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఇచ్చిందన్నారు.



దేశంలో ఉగ్రవాదంపై ఉకుపాదం మోపిందని చెప్పారు. రావణకాష్టంలా మండే కశ్మీర్‌లో 370 ఆర్టికల్ ఎత్తేసి.. శాంతి నెలకొల్పిన ఘనత మోదీ ప్రభుత్వానిదన్నారు. తొమ్మిదిన్నర ఏండ్ల మోదీ పాలనలో ఒక రూపాయి అవినీతి జరగలేదన్నారు.

గరుడ వార్త




## సంపాదకీయం

# సినిమా రంగానికి 'గద్దర్' అవార్డు ఏమిటి?

గద్దర్ తొలి జయంతిని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని సభని జయప్రదం చేశారు. ఇదే సందర్భంలో సినిమా పరిశ్రమకు ఇచ్చే నంది పురస్కారాన్ని ఇకపై గద్దర్ పురస్కారంగా ఇస్తానని ప్రకటించారు. అంతే కాకుండా ఆయన చాలా భావోద్వేగానికి గురైనట్లు కనిపించారు. 'ఇదే నా మాట నా మాటే శాసనం' అని రాజమాత శివగామీదేవి స్టైల్‌లో చెప్పేశారు. పక్కనే ఉన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా సంతోషించి ఆమోదించినట్లుగా ముఖ్యమంత్రిని హర్షపూర్వక ఆలింగనం చేసుకున్నారు. ఇలాంటి విధానపరమైన నిర్ణయాలను మంత్రిమండలిలో తీసుకొని తర్వాత ప్రజలకు చెప్తారు. కానీ ముఖ్యమంత్రి ఒక ఎమోషనల్ స్ట్రీమ్‌లో చెప్పేశారు. పరిపాలకులు ఎప్పుడూ ఎమోషన్‌లో నిర్ణయాలు తీసుకోకూడదు అని రాజనీతి చెబుతుంది. గద్దర్‌కి అభిమానులు కానివారెవరు... తెలుగువారు అందరూ ఆయనకు అభిమానులే. దేశవ్యాప్తంగా, విదేశాలలోనూ ఆయనకు అభిమానులు ఉన్నారు. ఆయన పాట, కవిత్వాన్ని విపరీతంగా అభిమానించే వారిలో నేనూ ఒకడిని. నేను ఎంత అభిమానిని అంటే గద్దర్ పాటలపైన నా విద్యార్థితో పిహెచ్.డి చేయించాను. కానీ ఇదే సమయంలో గద్దర్ పేరుతో సినిమా పరిశ్రమకు చెందినవారికి అవార్డు ఇవ్వడాన్ని అంగీకరించలేక పోతున్నాను. అంతేకాదు ఆ పరిశ్రమలోని అధికాధికులు అంగీకరించరు. కారణం గద్దర్‌కి సినిమా పరిశ్రమకు గరిష్ఠమైన సంబంధం లేదు. ఆయన కొన్ని సినిమాలకు పాటలు రాసి ఉండవచ్చు. కొన్ని సినిమాలలో చిన్న చిన్న అతిథి పాత్రలు చేసి ఉండవచ్చు. కానీ ఆయనకు, సినిమా రంగానికి ప్రధానమైన సంబంధం లేదు. సినిమా పరిశ్రమలోని వేరు వేరు రంగాలకు చెందినవారికి నటులు, దర్శకులు, పాటల రచయితలు, మాటల రచయితలు, సినిమాటోగ్రఫీ అంటే కెమెరా వారికి, తర్వాతి కాలంలో మేకప్ కళాకారులకు, ఆర్ట్ డైరెక్టర్లకు, ఇంకా వేరే శాఖల వారికి ఈ నంది పురస్కారాలు ఇస్తున్నారు. ఇందులో కూడా స్వర్ణ, రజత, కాంస్య, తామ్ర నందులను వరుసగా ప్రథమ, ద్వితీయ స్థాయిలలో ఇచ్చుకుంటూ వస్తున్నారు. ఈ అవార్డుని తెలుగు వారికి సాంస్కృతిక చిహ్నమైన నంది ఆకారంలో దాని పేరుతో ఇస్తున్నారు. నందిని ఎంచుకోవడానికి చాలా కారణాలున్నాయి. నంది విగ్రహం ఒక చరిత్రకు, ఆధ్యాత్మికతకు, మన సాంస్కృతిక చారిత్రక వారసత్వానికి గుర్తు, మన శిల్ప చిత్రకళలకు చిహ్నం. ఇది ఇన్ని విధాల వారసత్వానికి ఒక టోటెమ్. అందుకే నందిని పురస్కారానికి ఎంచుకున్నారు. ఇది లేపాక్షి నంది అని ఆంధ్ర వారి చిహ్నం అని తెలంగాణకు ఎందుకు అని భావించవలసిన పనిలేదు. నంది కాకతీయ శిల్పంలో చాలా అద్భుతమైన శిల్పకళా చిహ్నం. కాకతీయ వారసత్వానికి చిహ్నం. రామప్పగుడిలోని నంది, వేయిస్తంభాల గుడిలోని నంది, పానగల్లు ఛాయాసోమేశ్వరాలయం, పచ్చలసోమేశ్వరాలయంలోని నందులు తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక, కళా వారసత్వాలకు చిహ్నం. కాబట్టి నందిని నిస్సందేహంగా కొనసాగించవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ కవులకు కళాకారులకు హంస అవార్డును ఇవ్వడం కూడా మొదలు పెట్టారు. ఇది 1999లో జరిగింది. ఎందరో కవులకు కళాపురస్కారం పేరుతో వేరు వేరు రంగాల కళాకారులకు హంస అవార్డుని ఇచ్చారు. కాకతీయ ద్వార తోరణాలలో హంస ఉన్నది. కాకతీయ శిల్పంలో గొప్ప ఐకాన్ ఇది. నంది అంతగా ఇష్టంలేదు ఆంధ్ర వారు ఇస్తున్నారుగా అని అనుకుంటే... సినిమా పరిశ్రమ వారికి హంస గుర్తుతో కూడా పురస్కారాలు ఇవ్వవచ్చు. అంతేకాని సినిమా పరిశ్రమ వారికి గద్దర్ పేరుతో పురస్కారం ఇవ్వడానికి ఆ రంగంలో వారు సంతోషిస్తారని నేను అనుకోను. గద్దర్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరిపినప్పుడే వ్యతిరేకించిన వారున్నారు. ఇది పోలీసు వారి ఆత్మవిశ్వాసాలకు అనుగుణమైనది కాదని అన్నారు. గద్దర్ తన కెరీర్‌లో అంతా రాజ్యవ్యతిరేకంగా, సాయుధ విప్లవం ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యం అనే సైద్ధాంతిక భావజాలంతో గడిపాడు. తర్వాత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నమ్మకాన్ని ప్రకటించి పార్టీ పెట్టి ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనాలని భావించినా, ఇప్పుడున్న ప్రజాస్వామ్య విధానాలకు భిన్నమైన మావోయిస్టు భావజాలాన్ని ప్రధానంగా కలిగి జీవితంలో ఎక్కువభాగాన్ని గడిపినవాడు. ఇలాంటి వ్యక్తి పేరుతో సినిమా పరిశ్రమకు చెందిన కళారంగం, సాంకేతిక రంగాల వారికి పురస్కారాలు ప్రకటించడం సరైన చర్య కాదు. సినీరంగానికి చెందిన ఉన్నత స్థాయి నటులు, కవులు, గాయకులు గద్దర్ పురస్కారం గ్రహించి ఆయన ప్రతిమను సంతోషంగా ఇంటికి తీసుకుపోయి పెట్టుకుంటారా? అంతేకాదు రాజ్యం ఇప్పుడు గద్దర్ భావజాలాన్ని అంగీకరించి ముందుకు సాగగలదా? ఇవి ప్రజలందరి మనస్సులో ఉన్న ప్రశ్నలు. ఈ ప్రశ్నలు తక్షణం బయటికి రాకున్నా తర్వాత బయటికి వస్తాయి. అంతే కాదు సినిమారంగ ప్రముఖులకు కేంద్రం ఇచ్చే దాదాసాహెబ్ పురస్కారానికి తుల్యంగా నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రఘుపతి వెంకయ్య పురస్కారాన్ని ఇస్తూ వచ్చింది. బిఎన్ రెడ్డి పురస్కారం కూడా ఇచ్చారు.

# అత్యాశకు పోయి డబ్బుని సైబర్ నేరగాళ్ల పాలు చేసుకోవద్దు

## - పి టు పి క్రిప్టో ట్రేడింగ్ చేస్తున్న వారికి సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ వారి సూచన



**సైబరాబాద్ కమిషనరేట్ (గరుడ వార్త) :** అత్యాశకు పోయి తమ కష్టార్జితమైన డబ్బుని సైబర్ నేరగాళ్ల పాలు చేయవద్దని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ వారు సూచిస్తున్నారు. గ్రూప్స్ కి ప్రిపేర్ అవుతున్న ఒక విద్యార్థి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సైబరాబాద్ కు తన అకౌంట్ ఫ్రీజ్ అయ్యిందని దాని గురించి విచారించడానికి రావడం జరిగింది. అతని అకౌంట్లో ఉన్న లక్ష ఇరవై వేలు రూపాయలు ఫ్రీజ్ చేయబడింది. ఈ విద్యార్థి తన ఖర్చుల కోసం పి టు పి క్రిప్టో ట్రేడింగ్ చేస్తూ ఉన్నాడు. అతని దగ్గర ఉన్నది ఈ లక్ష 20వేల రూపాయ లే.. ఇప్పుడు అది మొత్తం బ్యాంకులో ఫ్రీజ్ అయింది. దీనికి కారణం పి టు పి ట్రాన్సాక్షన్ లో ఈ విద్యార్థి ట్రేడింగ్ చేసినది ఒక సైబర్ క్రిమినల్‌తో బాధితుల దగ్గర నుండి వచ్చిన డబ్బులు ఇలా పి టు పి ట్రాన్సాక్షన్ లో అమాయకులైన వారికి ఎక్స్ చేంజ్ చేసి సైబర్ క్రిమినల్స్ తప్పించుకొని అమాయకులని సైబర్ క్రైమ్ పోలీసులు తెలుపుతున్నారు. 1930కి అసలైన బాధితులు రిపోర్ట్ చేసినప్పుడు, బాధితుల నుంచి డబ్బులు ఏ ఏ బ్యాంక్ అకౌంట్లకు మరలా యో అట్టి అకౌంట్లు ఫ్రీజ్ చేయబడతాయి. ఈ విషయం గ్రహించిన సైబర్ క్రిమినల్స్ తాము కొల్లగొట్టిన డబ్బులు పోగొట్టుకోకుండా మరొక అమాయకులని బలి చేస్తున్నారని సైబరాబాద్ క్రైమ్ పోలీసులు తెలిపారు. క్రిప్టో ట్రేడింగ్ చేసి లాభం పొందాలని పి టు పి ట్రాన్సాక్షన్స్ చేస్తూ న్యాయబద్ధమైన డబ్బులు తెలిసో తెలియకో దొంగ సొమ్ముకు మార్చుకుంటున్నారు కనక పౌరులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పోలీసు వారి ఇన్వెస్టిగేషన్లో మీకు పి టు పి లో వచ్చిన డబ్బులు సైబర్ నేరస్తులు కొల్లగొట్టిన డబ్బులు అని నిరూపించ బడితే, ఆ డబ్బులు అసలు బాధితుడు ఎవరైతే ఫిర్యాదు చేశారో అతని బ్యాంకు.
మీ ఖాతా నుండి బాధితుడి ఖాతాకు పంపుతుందిని సైబరాబాద్ క్రైమ్ పోలీస్ వారు సూచిస్తున్నారు. కాబట్టి వ్యవస్థీకృతం కాని ఇటువంటి క్రిప్టో ట్రేడింగ్ ముఖ్యంగా P2P mode లో చేయవద్దు. మీ కష్టార్జితాన్ని సైబర్ నేరగాళ్ల పాలు చేయవద్దని, ముఖ్యంగా వారి నేరంలో తెలిసో తెలియకో భాగస్వాములు కావద్దు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం



**శామీర్ పేట, (గరుడ వార్త) :** శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ. 1 లక్ష రూపాయల విరాళం ఆదివారం అందజేశారు. మండలంలోని మజీద్ పూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన తుంకి రమేష్ తన వంతు సహాయంగా రూ. 1 లక్ష రూపాయలను గౌడ సంఘం సభ్యులకు విరాళంగా అందజేశారు. విరాళం అందజేసిన రమేష్ కు గౌడ సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని గౌడ సంఘం సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, గౌడ సంఘం సభ్యులు ఏట్టయ్య గౌడ్, మండల బిసి సెల్ అధ్యక్షుడు అబ్బగోని భాస్కర్ గౌడ్, వెంకటయ్య గౌడ్, బిక్షపతి గౌడ్, వీరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## ఈడీ సమన్ల నేపథ్యంలో...

# విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన కేజ్రీవాల్




న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మద్యం పాలసీ స్కామ్‌పై ఈడీ ఆరోసారి సమన్లు జారీ చేయడం, ఢిల్లీ కోర్టుకు కూడా హాజరుకావాల్సి ఉండటంతో ఆయనను అరెస్ట్ చేయవచ్చన్న ఊహాగానాలు వస్తుండటంతో ఈ చర్యకు దిగారు. శనివారం అసెంబ్లీలో విశ్వాస పరీక్షను ఎదుర్కోవాలని నిర్ణయించారు. శుక్రవారం అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన అరవింద్ కేజ్రీవాల్, ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందో అన్నదానిపై మాట్లాడారు. బీజేపీ సభ్యులు ఆప్ ఎమ్మెల్యేలను సంప్రదించారని, ఢిల్లీ సీఎంను త్వరలో అరెస్ట్ చేస్తారని వారితో చెప్పారని అన్నారు. అలాగే 21 మంది ఆప్ ఎమ్మెల్యేలు పార్టీని వీడేందుకు అంగీకరించారని, మరికొంత మంది బీజేపీతో టచ్‌లో ఉన్నట్లు ఆప్ ఎమ్మెల్యేలతో చెప్పడంతోపాటు బీజేపీలో చేరేందుకు రూ.25 కోట్లు ఆఫర్ చేశారని ఆరోపించారు. కాగా, బీజేపీ ఆఫర్‌కు తాము అంగీకరించలేదని ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు తనకు చెప్పారని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. అలాగే ఇతర ఆప్ ఎమ్మెల్యేలతో మాట్లాడగా ఏడుగురిని బీజేపీ ఎమ్మెల్యేలు సంప్రదించినట్లు తెలిసిందన్నారు. దీంతో మరోసారి ఆపరేషన్ కమలం కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలో మద్యం పాలసీ కుంభకోణంపై వచ్చిన ఆరోపణలు ఆ స్కామ్ గురించి కాదన్నది స్పష్టమవుతున్నదని కేజ్రీవాల్ అన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తప్పుడు కేసులు పెట్టి తమ పార్టీని విచ్ఛిన్నం చేసి ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నమని ఆరోపించారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లక్ష్యం మద్యం పాలసీపై దర్యాప్తు చేయడం కాదని, తమ నాయకులను అరెస్ట్ చేయడమేనని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఇప్పటికే కొందరిని అరెస్టు చేశారని అన్నారు. మద్యం పాలసీ కేసు ముసుగులో ప్రభుత్వాన్ని పడగొట్టడమే వారి లక్ష్యమని విమర్శించారు. వారు ఢిల్లీలో ఎప్పటికీ ఎన్నికల్లో గెలువలేరని తెలుసు కాబట్టి ఇలాంటి కుట్రకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు.

# మూడు చింతలపల్లి మండల నూతన తాసిల్దారుగా వెంకట నరసింహారెడ్డి



**శామీర్ పేట, (గరుడ వార్త) :** మూడు చింతలపల్లి మండల నూతన తాసిల్దార్ గా వెంకట నరసింహారెడ్డి బదిలీలో భాగంగా నియమితుల య్యారు. శుక్రవారం మూడు చింతలపల్లి మండలానికి కి బదిలీపై వచ్చిన తాసిల్దార్ వెంకట నరసింహ రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉప్పల్ మండలంలో విధులు నిర్వహించిన వెంకట నరసింహారెడ్డి బదిలీపై మూడుచింతలపల్లికి రాగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తాసిల్దార్ వాణి రెడ్డి బదిలీపై ఉప్పల్ కు వెళ్లారు. నూతనంగా విచ్చేసిన తాసిల్దార్ కు సిబ్బందితోపాటు వివిధ పార్టీల నాయకులు అభినందనలు తెలియజేశారు.

# మూడుచింతలపల్లి నూతన తహసిల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు



**శామీర్ పేట (గరుడ వార్త):** మూడుచింతలపల్లి మండలానికి శుక్రవారం నూతనంగా బదిలీపై వచ్చిన తహసిల్దార్ వెంకటనర్సింహారెడ్డినీ మర్యదపూర్వకంగా మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కటికెల వైద్యనాథ్, మండల పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు గుర్రం బస్వరెడ్డి, మండల పార్టీ కోశాధికారి మర్యాల వీరేశం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే.. ప్రాంతీయ పార్టీలకు ముప్పు: పీ చిదంబరం



న్యూఢిల్లీ: బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే ప్రాంతీయ పార్టీలకు ముప్పు అని కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం అన్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన పార్టీలన్నీ ఇండియా బ్లాక్‌లో ఉండాలని తాను హృదయపూర్వకంగా ఆశిస్తున్నానని చెప్పారు. ఆయన కొత్త పుస్తకం 'ది వాటర్‌షెడ్ ఇయర్–ఇండియా ఏ మార్గంలో వెళ్తోంది?'పై అన్న దానిపై పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జరిగిన చర్చా కార్యక్రమంలో చిదంబరం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పీటీఐతో మాట్లాడారు. ఇండియా బ్లాక్ కూటమి కమిటీలో తాను లేనని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ కూటమి భవిష్యత్తు గురించి తాను ఏమీ చెప్పలేనని అన్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రాల్లోని నిర్దిష్ట ప్రాంతీయ పార్టీల అస్తిత్వానికి సంక్షోభం కలుగుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో మిగిలిన పార్టీలన్నీ ఇండియా బ్లాక్‌లో ఉండాలని తాను హృదయపూర్వకంగా ఆశిస్తున్నానని అన్నారు. కాగా, త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య రామమందిరం ఒక అంశం అవుతుందని చిదంబరం తెలిపారు. అయితే అది నిర్ణయాత్మకమైనదేనా అన్నది కాలమే చెబుతుందని అన్నారు. సుస్థిరమైన, బలమైన రాజకీయ పార్టీలతో ఇండియా కూటమిని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నదని అన్నారు.

# వెనక్కి తగ్గని రైతులు..రైళ్లను అడ్డుకుంటామని వార్నింగ్



**న్యూఢిల్లీ :** పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని కోరుతూ 'ఢిల్లీ చలో' ఆందోళన చేపట్టిన రైతులు వెనక్కి తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో నేడు కేంద్రంలో మూడో విడతలో రైతులతో చర్చలు జరుపనుంది.కాగా, చండీగఢ్‌లో సాయంత్రం ఐదు గంటలకు రైతు సంఘాల నేతలతో కేంద్రమంత్రులు అర్జున్ ముండా, పీయూష్ గోయల్, నిత్యానంద రాయ్ చర్చలు జరుపనున్నారు. మరోవైపు.. కొందరు రైతులు పంజాబ్‌లో రైళ్లను అడ్డుకుంటున్నటు తెలుస్తోంది. దీంతో, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్టు సమాచారం.ఇదిలా ఉండగా.. ఢిల్లీ చలో కార్యక్రమంలో భాగంగా రైతులు మూడు రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో దేశ రాజధాని ఢిల్లీకి చేరుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. కాగా.. పంజాబ్, హర్యానా సరిహద్దులోని శంభు వద్ద వేల మంది మోహరించారు. పంజాబ్‌లోని పలు ప్రాంతాల నుంచి అక్కడికి రైతులు భారీగా చేరుకుంటున్నారు. జాతీయ రహదారి అంతా ట్రాక్టర్లతో నిండిపోయింది. మరోవైపు.. హర్యానాలోని జింద్ జిల్లా దాతా సింగ్‌వాలా ఖనౌరీ సరిహద్దు వద్ద కూడా రైతులు భారీగా మోహరించి ఉన్నారు. రెండు చోట్లా బారికేడ్లను, ముళ్ల కంచెలను భద్రతా సిబ్బంది ఏర్పాటు చేశారు.

## నవాజ్, బిలావల్ దోస్తీ



**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు ఇమ్రాన్‌ఖాన్ వ్యతిరేకులంతా ఒక్కటయ్యారు. సైన్యం ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయంతో నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లింలీగ్ (పిఎంఎల్-ఎన్), బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ చేతులు కలిపాయి. ఈ రెండు పార్టీల మధ్య డీల్ కుదరడంతో నవాజ్ షరీఫ్ తన సోదరుడు మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ప్రధాని పదవికి నామినేట్ చేస్తున్నట్లు ప్రకటించారు. తన కుమార్తె నవాజ్‌ను పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రిగా నామినేట్ చేశారు. ఈ మేరకు పార్టీ ప్రతినిధి మరియం ఔరంగజేబ్ ఎక్స్‌కు తెలిపారు. ఇమ్రాన్‌ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) ప్రజా తీర్పును ఈ రెండు పార్టీలు దొంగిలించాయని విమర్శించింది. ఎన్నికల్లో పిటిఐ మద్దతునిచ్చిన ఇండిపెండెంట్ అభ్యర్థులు 93 మంది గెలిచి అతిపెద్ద గ్రూపుగా వున్నప్పటికీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సాధారణ మెజార్టీ మార్క్ 133కి చేరుకోలేకపోయింది. అటు పిఎంఎల్‌తో కానీ ఇటు పిపిపితో కానీ చేరేది లేదని పిటిఐ స్పష్టం చేసింది. పిఎంఎల్-ఎన్ కు 75 సీట్లు రాగా, పిటిఐకి చెందిన కొందరి ఇండిపెండెంట్లను తన వైపు తిప్పుకుని 80కి తన బలాన్ని పెంచుకుంది. 54 సీట్లతో మూడో స్థానంలో ఉన్న పిపిపితో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. అంశాల వారీ మద్దతు ఇచ్చేందుకు పిపిపి అంగీకరించింది. ఇమ్రాన్‌ను అధికారంలోకి రానీయకుండా ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత అనేక అక్రమాలకు పాల్పడిన సైన్యం ఇప్పుడు పిఎంఎల్(ఎన్), పిపిపిలను ఒక దగ్గరకు చేర్చడంలో తెరవెనక పాత్ర పోషించినట్లు పరిశీలకులు పేర్కొంటున్నారు.

## ముందంజలో రక్షణ మంత్రి ప్రబౌ....




**జకార్తా :** ఇండోనేషియాలో బుధవారం అధ్యక్ష, ఉపాధ్యక్ష, పీపుల్స్ కన్సల్టేటివ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇందులో ప్రతినిధుల సభ, సెనెట్, ప్రావిన్షియల్, సిటీ, రీజెన్సీ స్థాయిలో స్థానిక లెజిస్లేటివ్ సంస్థల సభ్యులున్నారు. 1998లో నియంతృత్వ పాలన ముగిసిన తర్వాత జరుగుతున్న ఐదవ ఎన్నికలు ఇవి. ప్రపంచంలోనే మూడువ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండోనేషియాలో మొత్తంగా ఎన్నికలు జరిగే 20,600 పదవులకు గానూ దాదాపు 2,59,000మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. భారీ వర్షాలు, వరదలతో పోలింగ్‌కు అంతరాయాలు ఏర్పడ్డాయి. అయినా ఓటర్లు అత్యుత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. సుమారు 20 కోట్ల మంది ఓటర్లు దేశంలోఉన్నారు. కాగా, అధ్యక్షుడు జోకో విడొడొ వారసుడిగా ఎవరు వస్తారనే అంశంపైనే అందరి దృష్టి వుంది. ఎన్నికల ఫలితాల్లో రక్షణ మంత్రి ప్రబౌ సుబియాంటో తన ప్రత్యర్థుల కన్నా ఆధిక్యతలో కొనసాగుతున్నారు. తానే విజయం సాధించినట్లు ఆయన చెప్పుకుంటున్నా ప్రత్యర్థులు ఇరువురు మాత్రం ఓటమిని అంగీకరించడం లేదు. అధికారికంగా ఫలితాలు వచ్చే వరకు వేచి చూడాలంటున్నారు. అత్యంత సంక్లిష్టమైన ఇండోనేషియా పోలింగ్ ప్రక్రియలో ఓట్ల ఫలితాలు అధికారికంగా రావడానికి అనేక వారాలు పడుతుంది.

## బెంగాల్ పోలీసుల దాష్టీకాన్ని ఖండించిన సిఐటియు, ఎఐకెఎస్



న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో మంగళవారం నాడు శాంతియుతంగా ప్రజా ఆందోళనలో పాల్గొంటున్న కామ్రేడ్ అనరుల్ ఇస్లాంను కాల్చి చంపిన పశ్చిమ బెంగాల్ పోలీసుల దారుణ చర్యలను సిఐటియు, ఎఐకెఎస్‌లు తీవ్రంగా ఖండించాయి. ఇస్లాం మృతికి కారకులైన వారిని గుర్తించి, వారిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, ఎఐకెఎస్ అధ్యక్ష కార్యదర్శులు అశోక్ ధావలె, విజూ కృష్ణమూర్తిలు వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌నకు ఎస్‌కెఎం-సిటియులు సంయుక్తంగా పిలుపిచ్చాయి. అయితే బెంగాల్ హయ్యర్ సెకండరీ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఆ పోరాటాన్ని బెంగాల్‌లో 13నే నిర్వహించారు. ఆ కార్యక్రమంలో భాగంగా శాంతియుతంగా పౌర ఉల్లంఘన కార్యాచరణలో పాల్గొంటున్న వ్యవసాయ కార్మికుడు, ఎఐఎడబ్ల్యుయు కార్యకర్త అనరుల్ ఇస్లామ్ (53)ను పోలీసులు కాల్చి చంపడాన్ని నేతలు ఖండించారు. ఆ అమరవీరునికి అరుణాంజలి ఘటించారు. ఇలాంటి చర్యలతో ప్రజా పోరాటాలు ఆగవని, మరింత ఉధృతంగా ముందుకు సాగుతాయని వారు స్పష్టం చేశారు. ఎలాంటి కవ్వింపు చర్యలు లేనప్పటికీ ఇంత ఆటవికంగా కాల్చి చంపడంలో తృణమూల్ ప్రభుత్వ నిరంకుశాధికారం ప్రదర్శితమవుతోందని అన్నారు. పోలీసుల పాశవిక చర్యలను, బెంగాల్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని సిఐటియు, ఎఐకెఎస్‌లు తీవ్రంగా ఖండిస్తున్నాయని వారు ఆ ప్రకటనల్లో పేర్కొన్నారు. అనరుల్ ఇస్లామ్ మరణం వృధా కానివ్వబోమని చెప్పారు. కార్పొరేట్ అనుకూల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున, మరింత ఉధృతంగా ఈ ప్రజా పోరాటాలు కొనసాగుతాయని అన్నారు. 16న జరిగే బంద్‌ను మరింతగా జయప్రదం చేసేందుకు కంకణబద్ధులు కావాలని అన్ని వర్గాలకు పిలుపిచ్చారు.

## ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మరోసారి ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి సమన్లు జారీ చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఫిబ్రవరి 19న తమ ఎదుట విచారణకు హాజరు కావాలని తెలిపింది. కాగా కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేయడం ఇది ఆరోసారి. గతంలో కేజ్రీవాల్‌కు ఈడీ అయిదుసార్లు సమన్లు జారీ చేసింది. ప్రతిసారి ఆయన విచారణకు హాజరు కాలేదు. తాజాగా సోమవారం(ఫిబ్రవరి 19న) విచారణకు హాజరు కావాలని బుధవారం మరోసారి ఈడీ సమన్లు పంపింది. మరి ఈసారైనా కేజ్రీవాల్ ఈడీ విచారణకు హాజరవుతారో లేదో వేచిచూడాలి. ఈడీ నోటీసులను అక్రమమని, చట్టవిరుద్దమ ఢిల్లీ సీఎం పేర్కొన్నారు. ఈడీ సమన్ల ద్వారా తనను లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చేయడమే లక్ష్యంగా కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే ఈడీ పదేపదే నోటీసులు జారీ చేయడం వెనక కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపిస్తుంది. కేజ్రీవాల్‌ను



అరెస్ట్ చేయడమే ప్రధాని మోదీ లక్ష్యమని, దీని ద్వారా ఢిల్లీ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారని విమర్శలు గుప్పించింది. అది ఎప్పటికీ జరగకుండా చూస్తామని తెలిపింది. కాగా గతంలో నవంబర్ 1న తొలిసారి ఢిల్లీ సీఎంకు ఈడీ సమన్లు జారీ చేసింది. తరువాత డిసెంబర్ 21, ఈ ఏడాది జనవరి 3, జనవరి 18, ఫిబ్రవరిన హాజరు కావాలని నోటీసులు ఇవ్వగా.. సీఎం అరవింద్ కేజ్రీవాల్ వాటిని భేఖతారు చేశారు.

## బిల్కిస్ బానో కేసు సుప్రీంకోర్టులో గుజరాత్ ప్రభుత్వం రివ్యూ పిటిషన్




**న్యూఢిల్లీ :** బిల్కిస్ బానో సామూహిక లైంగికదాడి కేసులో గతనెల 8 నాటి సుప్రీంకోర్టు తీర్పుపై గుజరాత్ ప్రభుత్వం స్పందించింది. ఈ కేసులో సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసింది. నాటి తీర్పులో న్యాయస్థానం రాష్ట్రంపై చేసిన వ్యాఖ్యలు 'అత్యంత అసమంజకరం' అని గుజరాత్ ప్రభుత్వం పేర్కొన్నది. వాటిని తొలగించాలని కోరింది. ఆమె కుటుంబానికి చెందిన 14 మందిని హత్య చేసిన కేసులో దోషులుగా తేలి, యావజ్జీవ కారాగార శిక్ష పడిన 11 మందికి గుజరాత్ ప్రభుత్వం రెమిషన్ మంజూరు చేయటంపై సర్వోన్నత న్యాయస్థానం గతనెల 8న తీర్పులో అభ్యంతరం వ్యక్తం చేసింది. రెమిషన్ మంజూరు చేసిన గుజరాత్ ప్రభుత్వ ఉత్తర్వును సైతం కొట్టిపారేసింది. గుజరాత్ ప్రభుత్వం ''నిందితులతో సామరస్యపూర్వకంగా వ్యవహరించి, సహకరించింది" అని అత్యున్నత న్యాయస్థానం చేసిన పరిశీలన రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగించిందని తన రివ్యూ పిటిషన్‌లో వాదించింది. 2022, మేలో నాటి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమే తాము పని చేశామని పేర్కొన్నది. 2002లో రాష్ట్రంలో జరిగిన మతపరమైన అల్లర్లలో బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడి చేసి ఆమె కుటుంబానికి చెందిన 14 మందిని హత్య చేసిన కేసులో దోషులుగా తేలి, యావజ్జీవ కారాగార శిక్ష పడిన 11 మందికి గుజరాత్ ప్రభుత్వం రెమిషన్ మంజూరు చేయటంపై సర్వోన్నత న్యాయస్థానం గతనెల 8న తీర్పులో అభ్యంతరం వ్యక్తం చేసింది.

## భారతీయ సినిమా పితామహులు ఫాల్కే

దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గురించి భారత దేశములో తెలియని వారు ఉండరేమో. భారతీయ సినిమాకు గణనీయమైన సేవ చేసిన వారికి ప్రతి సంవత్సరం ఇచ్చే పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు. భారతీయ సినిమాకు పితామహుడుగా భావించబడే ఫాల్కే జన్మదిన సందర్భంగా 1963లో ఈ పురస్కారం ఏర్పాటు చేయబడింది. అయితే ఫాల్కే గురించి మాత్రం చాలా మందికి తెలియ దంటే ఆశ్చర్యం కలుగ మానదు. భారతీయ సినిమా పరిశ్రమ ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమలలో ఒకటి. ఎన్నో వేల కుటుంబాలకు జీవనాధారంగా ఉంటూ, కోట్ల ప్రజానీకానికి వినోదాన్ని, ఆటవిడుపునూ అందిస్తున్న సాధనం సినిమా. భారత సినీ పరిశ్రమకు ఆద్యునిగా పేరు గాంచింది దాదాసాహెబ్ ఫాల్కే. అతను అసలు పేరు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే. 1896లో అతను బొంబాయి లోని వాట్సన్ హోటల్‌లో ఏసుక్రీస్తు చరితం పై ప్రదర్శించ బడిన సినిమాను చూడటం జరిగింది. ఆ ప్రభావంతో అతను హైందవ దేవతలను చూపుతూ సినిమాలు తియ్యాలన్న సంకల్పానికి వచ్చారు. 1913లో అతను తీసిన రాజా హరిశ్చంద్ర సినిమాతో మొదలైన అతను సినీ జీవితం 19 సంవత్సరాలు సాగింది. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, స్క్రీన్‌ప్లే-రచయితగా ఈ కాలంలో అతను 95 చిత్రాలను, 26 లఘుచిత్రాలను రూపొందించారు. 1870లో నాసిక్‌లోని త్రయంబకేశ్వర్‌లో 1870 ఏప్రిల్ 30 న జన్మించారు. బొంబాయిలోని జెజె కాలేజ్ ఆఫ్ ఆర్ట్సులో, బరోడాలోని కళాభవన్ విద్యార్థి. మంచి చిత్రకారుడు, నాటకాల్లో మేకప్ వేశారు. మంచి మెజీషియన్ కూడా... ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలంలోనే ప్రింటింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం జర్మనీ వెళ్లాలనుకున్నారు. సినిమాకు సంబంధించిన వార్త ఒకటి పత్రికలో వచ్చింది. తనను ఆ వార్త బాగా ఆలోచింపజేసింది. మన దేశంలో కూడా సినిమాను ఎందుకు తీయకూడదు అనే ఆలోచన అతన్ని కుదురుగా ఉండనివ్వలేదు. తన వద్ద ఉన్న డబ్బు, మిత్రుల నుంచి తీసుకున్న అప్పు, జీవిత బీమా డబ్బు మొత్తం తీసుకొని సినిమా నిర్మాణానికి సంబంధించిన పరికరాలు కొనడానికి 1912లో ఇంగ్లాండ్ వెళ్లారు. అయితే ఫాల్కేకు తాను చరిత్ర సృష్టించ బోతున్నానని తెలియదు, అదే తన జీవితాన్ని పేదరికం లోకి నెట్టివేస్తుందనీ ఊహించలేదు. ఫాల్కే 1913లో రాజా హరిశ్చంద్ర, ఆదే సంవత్సరం మోహినీ భస్మాసుర, సత్యవాన్ సావిత్రి (1914) శ్రీకృష్ణ జననం (1918) కాళీయ మర్దన్ (1919) నిర్మించారు. ఆ తరువాత సినిమా రంగంలో క్రమంగా వ్యాపార ధోరణి మొదలైంది. దాంతో పాల్కే పక్కకు తప్పుకున్నారు. సినిమా ప్రేమ ఆయన్ని నిలువనివ్వలేదు. తన పలుకుబడి, పరిచయాలు ఉపయోగించి నిధులు సమీకరించి 1937లో గంగావతరణ సినిమా తీశారు. నిండా మునిగి పోయారు. సినిమాను వ్యాపారంగా చూసి ఉంటే ఆయన పరిస్థితి బాగానే ఉండేది. సినిమాను విపరీతంగా ప్రేమించి దెబ్బతిన్నారు. తన వారసులను పేదరికంలోకి నెట్టేశారు. ఆయన దేశానికి తీసుకు వచ్చిన సినిమాతో సినీ వ్యాపారులు కోట్లు సంపాదించారు. పాపులారిటీని, రాజకీయాల్లో పదవులు సంపాదించారు కానీ ఫాల్కే మాత్రం కఠిక దరిద్రంలో మరణించారు. ఆయన కుమారుడు ముంబై వీధుల్లో చిల్లర వ్యాపారిగా జీవితం గడిపారు. బాగున్న రోజుల్లో ఫాల్కే ఫోర్డ్ కారును ఉపయోగించే వారు. 1920 ప్రాంతంలో ఆ కారులోనే షూటింగ్‌కు వెళ్లేవారు. తిరిగి సినిమా తీయాలని నిర్ణయించుకున్న కాలంలో దాన్ని అమ్మేశారు. ఆ కారు పెళ్ళిళ్ల ఊరేగింపునకు ఉపయోగించారు. ఐదేళ్ల క్రితం ఈ కారు నాసిక్ డంప్ యార్డ్‌లో లభించింది. తొలి భారతీయ సినిమా కెమెరాను ఫాల్కే జర్మనీ నుంచి తెప్పించారు. అదేమైందో ఇప్పుడు ఎవరికీ తెలియదు. సినిమా నిర్మాణానికి ఎలాంటి ఏర్పాట్లు లేని కాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఫాల్కే తొలి సినిమా తీశారు. ఫాల్కే భార్య సరస్వతి భారతీయ తొలి సినిమా రాజా హరిశ్చంద్ర నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆమెనే తొలి భారతీయ సినిమా టెక్నీషియన్. సరస్వతి షూటింగ్ సమయంలో వెలుతురు కెమెరాపై పడకుండా బెడ్ షీట్‌ను అడ్డుగా పట్టుకుని ఉండేవారట. షూటింగ్‌కు కావలసినవన్నీ సమకూర్చేవారు. రాత్రి పూట క్యాండిల్ వెలుగులోనే ఈ సినిమాకు సంబంధించిన సాంకేతిక పనులు నిర్వహించే వారు. సినిమా బృందం 60-70 మందికి ఆమెనే వంట చేసి పెట్టేవారు. రాజా హరిశ్చంద్రలో హరిశ్చంద్రుని కుమారునిగా ఫాల్కే కుమారుడు బాలచంద్ర నటించారు. తొలి భారతీయ బాలనటుడు అతనే. శ్రీకృష్ణ జననం, కాళీయ మర్దన్‌లో బాల శ్రీకృష్ణునిగా మందాకిని నటించారు. ఆమె ఫాల్కే పెద్ద కూతురు. ఆమెనే తొలి భారతీయ బాలనటి. భారతీయ సినిమా రజతోత్సవ వేడుకల్లో దాదాసాహెబ్ ఫాల్కే ఒక అనామకుడిగా కూర్చోవడం చూసిన శాంతారాం ఆయన్ని గుర్తించి వేదికపైకి తీసుకు పోయి 1938లో అప్పటికప్పుడు వేదికపై ఐదువేల రూపాయల పర్స్ అంద జేశారు. ఆ డబ్బుతో ఫాల్కే తిరిగి సినిమా తీస్తాడేమోనని చాలా మంది భయపడ్డారు. ఎందుకంటే సినిమా అంటే ఆ మహనీయునికి అంత పిచ్చి. అందరూ ఒత్తిడి తెచ్చి ఆ డబ్బుతో నాసిక్‌లో ఒక ఇంటిని కొనిపించారు. అప్పటి వరకు ఫాల్కేకు సొంత ఇల్లు కూడా లేదు. ఆ ఇంటిలోనే తుది శ్వాస విడిచారు..1971 లో ఆయన గౌరవార్థం ఇండియా పోస్ట్ ప్రత్యేక స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. ఫిబ్రవరి 16, 1944 న మరణించారు. 90 సినిమాలను నిర్మించిన భారతీయ సినిమా పితామహుడు దరిద్రంతోనే కన్నుమూసినా, ఈ నాటికీ అతని జీవన మూల్యాలు ఆదర్శంగా, స్ఫూర్తినిచ్చేవిగానే ఉన్నాయి. అతని పేరు మీద జాతీయ అవార్డుల సంరంభం ప్రతి యేటా జరుగుతున్నా, ఆయన జీవిత చరమాంకం ఎంతటి దైన్యావస్థలో గడిచిందో ఎవరూ తలచక పోవటం శోచనీయం.

# బల పరీక్షకు ఆప్ సర్కార్ సిద్ధం




న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం అసెంబ్లీలో తన ప్రభుత్వంపై విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై శనివారం అసెంబ్లీలో చర్చ జరగనున్నది. తమకు రూ. 25 కోట్లను ముట్టచెబుతామని ప్రలోభ పెడుతూ బిజెపి సభ్యులు కొందరు తమను సంప్రదించారని తన పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తనకు చెప్పారని విశ్వాస తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెడుతున్న సందర్భంగా ఆప్ అధినేత తెలిపారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తారని, ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం పడిపోతుందని కూడా బిజెపి ఎమ్మెల్యేలు బెదిరించినట్లు ఆప్ ఎమ్మెల్యేలు తెలిపారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు తప్పుడుదని, ఆప్ ప్రభుత్వాన్ని కూల్చాలని బిజెపి భావిస్తోందని ఆయన ఆరోపించారు.

**ఏడుగురు బిజెపి ఎమ్మెల్యేల సస్పెన్షన్**

లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలినందుకు ఢిల్లీ అసెంబ్లీ నుంచి ఏడుగురు బిజెపి ఎమ్మెల్యేలను ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్ చేస్తూ స్పీకర్ ఆదేశాలు జారీచేశారు. బిజెపి సభ్యుల ప్రవర్తనను గురువారం అసెంబ్లీ స్పీకర్ రాంనివాస్ గోయల్ సభా హక్కుల కమిటీ దృష్టికి తీసురు వెళ్లారు. కాగా..అధికార ఆప్ ప్రజస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతును నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ప్రతిపక్ష నాయకుడు (బిజెపి) రాంవీర్ సింగ్ బిధూరి ఆరోపించారు. ఆప్ ప్రభుత్వ విజాయలను ప్రస్తావిస్తూ గురువారం లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా అసెంబ్లీలో ప్రసంగిస్తున్న తరుణంలో బిజెపి సభ్యులు పలుమార్లు ఆయన ప్రసంగానికి అడ్డు తగిలారు. కేజ్రీవాల్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడేందుకు వారు ప్రయత్నించారు.

# మణిపూర్ చురాచంద్‌పూర్‌లో ఉద్రిక్తత..ఇద్దరు మృతి



చురాచంద్‌పూర్ : మణిపూర్‌లోని చురాచంద్‌పూర్ పట్టణంలో పరిస్థితి శుక్రవారం కూడా ఉద్రిక్తంగానే ఉందని పోలీసులు వెల్లడించారు. ఒక కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు నిరసన సూచకంగా ఒక గుంపు గురువారం మినీసెక్రటేరియట్‌లోకి దూసుకుపోయినప్పుడు భద్రత దళాలతో జరిగిన సంఘర్షణలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో మరి 42 మంది కూడా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వైరల్ అయిన వీడియోలో సాయుధ వ్యక్తుల వెంట ఉన్నట్లుగా కానిస్టేబుల్ శ్యామ్‌లాల్‌పాల్ కనిపించిన తరువాత అతనిని సస్పెండ్ చేశారు. మృతులను లెత్లాల్‌ఖువోల్ గంగ్తె, తంగున్‌లెన్ హావోకిప్‌గా గుర్తించినట్లు పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. 'తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులను చురాచంద్‌పూర్ జిల్లా ఆసుపత్రిలో చేర్పించినట్లు ఆయన తెలిపారు. 'చురాచంద్‌పూర్ జిల్లా మినీ సెక్రటేరియట్ ప్రాంతం పరిసరాల్లో ఆస్తుల విధ్వంసం, దగ్ధం వార్తలు వచ్చాయి' అని ఆ అధికారి చెప్పారు, 'ముఖ్యమైన పలు పత్రాలు, ప్రభుత్వ రికార్డులను హింసాకాండలో ధ్వంసం చేశారురు' అని అధికారి తెలియజేశారు. డిప్యూటీ కమిషనర్ అధికార నివాసానికి కూడా అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఆగ్రహోదగ్రులైన మూకలు నిప్పు అంటించినట్లు పోలీసులు తెలిపారు. ఇది ఇలా ఉండగా, జిల్లా ఎస్‌పి శివానంద్ సుర్వే, డిసి ఎస్ ధరున్ కుమార్ '24 గంటల్లో'జిల్లా వదలి వెళ్లాలని, వారి స్థానాల్లో 'వీలైతే కుకి జో తెగ నుంచి అధికారులను' నియమించాలని స్వజాతీయ గిరిజన నాయకులు వేదిక (ఐటిఎల్ఎఫ్) డిమాండ్ చేసింది.

## ఏపీ విద్యార్థులకు శుభవార్త.. అందుబాటులోకి ప్రపంచస్థాయి కోర్సులు

ప్రముఖ విద్యా పోర్టల్ ఎడెక్స్ తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఉన్నత విద్యారంగంలో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఒప్పందం చేసుకున్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పారు. ఎడెక్స్ ప్రతినిధులతో ప్రభుత్వం ఎంఓయు చేసుకున్న సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు రెండువేలకు పైగా ప్రపంచస్థాయి కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రపంచ వర్శిటీ అధ్యాపకులతో ఆన్ లైన్ లో బోధన జరుగుతుందని చెప్పారు. ఈ కోర్సులకు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, హార్వర్డ్, ఎంఐటీ వంటి ప్రముఖ యూనివర్శిటీల కోర్సులను దీనిద్వారా నేర్చుకోవచ్చునని చెప్పారు. మన పిల్లలు ప్రపంచస్థాయితో పోటీ పడాలని, అప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందని అన్నారు.

# కుల గణన! మత గణన! వర్గ గణన......!






'కుల గణన విదేశీ శక్తుల ఎజండా?' పేరుతో వచ్చిన కె. అరవిందరావు వ్యాసానికి ప్రతిస్పందన ఇది. ఆ వ్యాసంలో, 'సంప్రదాయ మార్క్సిజం', 'సాంస్కృతిక మార్క్సిజం', 'రథయాత్ర', 'మండల్ కమిషన్ నివేదిక', 'హెయిర్ కటింగ్ రంగం', 'హిందూ సంస్కృతి', 'భారతీయ సంస్కృతి' అంటూ అనేక విషయాల గురించి అవాస్తవాలు రాశారు, వ్యాసకర్త!

(1) మార్క్సిజంలో 'సంప్రదాయ మార్క్సిజం' అనీ, 'సాంస్కృతిక మార్క్సిజం' అనీ, తేడాలేమీ ఉండవు. మార్క్సు, ఎంగెల్సులు, తమకు పూర్వం వున్న సిద్ధాంతాలను, విమర్శనాత్మకంగా పరిశీలించి రూపొందించిన 'శ్రామికవర్గ పోరాట సిద్ధాంతం' ఒక్కటే వుంటుంది. దానిని, వేరు వేరు దేశాలలో ఉన్న పరిస్థితులను బట్టి అన్వయించుకోవడం మాత్రమే జరిగింది. అది తప్ప, మార్క్సిజం చెప్పిన 'శ్రమ దోపిడీ' అనే సత్యాన్ని మించిన సత్యాన్ని, ఇప్పటివరకూ ఎవరూ కనిపెట్టలేదు.

(2) 'గ్రామ్షీ' వంటి కమ్యూనిస్టు మేధావులు కనిపెట్టారని వ్యాసకర్త చెపుతున్న 'సాంస్కృతిక పెత్తందారీతనం' ('కల్చరల్ హెగిమొనీ') అనే భావన, కొత్త సత్యమేమీ కాదు. ఆ పద ప్రయోగమే కొత్త! మార్క్సు-ఎంగెల్సులు 1845లో రాసిన 'జర్మన్ ఐడియాలజీ'లోనూబీ 1848లో రాసిన 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లోనూ, ఆ భావన చాలా స్పష్టంగా ఉన్నదే. వాళ్ళ మాటలు చూడండి: "ప్రతీయుగంలోనూ, పాలించే భావాలు, ఆ నాటి పాలకవర్గ భావాలే" (కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, పేజీ-66). "భౌతిక ఉత్పత్తి సాధనాలను తన అదుపులో కలిగివున్న వర్గమే, దాని ఫలితంగా బౌద్ధిక ఉత్పత్తి సాధనాలను కూడా కంట్రోల్ చేస్తుంది. బౌద్ధిక ఉత్పత్తి సాధనాలను కలిగివుండని వారి భావాలు, మొత్తం మీద, కంట్రోలు చేసే వర్గానికి లోబడివుంటాయి... పాలకవర్గ భావాలు అనేవి, ప్రబలంగా వున్న భౌతిక సంబంధాలకు ఖచ్చితమైన వ్యక్తీకరణ తప్ప ఇంకేమీ కాదు." (జర్మన్ ఐడియాలజీ, పేజీ-67) మార్క్సు, ఎంగెల్సులు చెప్పిన భావాన్నే, గ్రామ్షి గానీ, ఇంకో కమ్యూనిస్టు గానీ చెప్పగలిగారు గానీ, వర్గాతీతమైన భావాన్నయితే చెప్పలేదు! కాబట్టి, 'సంప్రదాయ మార్క్సిజం' అనీ, 'సాంస్కృతిక మార్క్సిజం' అని వేరే వేరే పేర్లు పెట్టినంత మాత్రాన, మార్క్సిజపు సారాంశం మారదు. (3) "అనేక దేశాల్లో ఆర్థిక అసమానతలున్నా, వర్గ పోరాటాలు జరగలేదు." అని వ్యాసకర్త వ్యాఖ్య! అవి జరగలేదంటే, అది మార్క్సిజంలో లోపం కాదు. వర్గ పోరాటాలు అనేవి, పగలూ-రాత్రీ లా, అమావాస్యా పౌర్ణమీలా, ప్రకృతి సహజంగా జరగవు! వర్గ పోరాటాల కోసం, శ్రామికవర్గ పార్టీలైన కమ్యూనిస్టు పార్టీలకు, మార్క్సిస్టు సిద్ధాంత గ్నానంతో, నడిచే సామర్థ్యాలు బలహీనపడి ఉండవచ్చు! అలా జరగలేదు కాబట్టి, 'సాంస్కృతిక మార్క్సిజం' అనే భావన వచ్చిందనడం తప్పు! వర్గ పోరాటాలలోకి శ్రామిక జనాల్ని సమీకరించడానికి, కావలిసిన వర్గ చైతన్యం ప్రాధాన్యతను నొక్కి చెప్పే సందర్భంలో, గ్రామ్షి 'సాంస్కృతిక పెత్తనం' అనే మాటని వాడాడు. సంస్కృతి అంటే భావజాలం. శ్రామిక జనాల మీద పాలక వర్గ సంస్కృతి పెత్తనాన్ని ఎదుర్కోవడానికి శ్రామిక వర్గ మేధావులు కృషి చెయ్యాలని చెప్పిన సందర్భం అది! ఈ భావన, మార్క్సు ఎంగెల్సులు చెప్పని భావన కాదు. ఉదాహరణకి, సమాజానికి ఒక పునాదీ (ఆర్థిక సంబంధాలు), ఆ పునాదికి అనుగుణమైన, ఉపరితలం (సంస్కృతీ, రాజకీయాలూ, మతం మొదలైనవి) ఉంటాయని మార్క్సు, ఎంగెల్సులు గతంలోనే చెప్పివున్నారు. (4) "హిందూ మతం, కులాన్ని నిర్మించిందన్నది అసత్య ప్రచారం" అని వ్యాసకర్త వాదన. హిందూ మత గ్రంథాలలో నాలుగు వర్ణాల గురించే రాశారట గానీ, కులాల గురించి చెప్పలేదట! ఏ మతాల్లోనూ లేని ఆ వర్ణ వ్యవస్త హిందూ సమాజంలో మాత్రమే ఉందంటే, అది హిందూ మతానికి వున్న ప్రత్యేక లక్షణమే! వర్ణ వ్యవస్త మానవుల్ని ఎలా విభజించిందో చూడండి! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనేవే ఆ నాలుగు వర్ణాలూ. ఇవన్నీ అసమాన వర్ణాలే! వాటిల్లోని అసమానత్వమే, అనేక వేల కులాలు ఏర్పడడానికి దారి తీసింది. అసలు గ్రహించవలిసింది: వర్ణ వ్యవస్తలో గానీ, కుల వ్యవస్తలో గానీ వున్నదంతా, అసమాన శ్రమ విభజనే! అసమాన శ్రమ విభజన అంటే, మానవుల్లో కొందరు ఎక్కువ విలువ గలిగిన మేధా శ్రమలూబీ కొందరు తక్కువ విలువ గలిగిన శారీరక శ్రమలూబీ కొందరు ఎప్పుడూ మురికిని శుభ్రం చేసే శ్రమలు చేయవలిసి రావడం, కొందరు ఆ రకం పనులు ఎప్పుడూ చెయ్యకపోవడం... ఇలాంటి పరిస్తితే అసమాన శ్రమ విభజన! అయితే, ఈ అసమాన శ్రమ విభజన అనేది, ప్రపంచ వ్యాప్తంగా, అన్ని మతాలలోనూ వున్నప్పటికీ, హిందూ మతం మాత్రమే వర్ణ వ్యవస్తని ఎందుకు కౌగలించుకుందో ఊహించుకోవలిసిందే! ఇప్పుడు మనం చెయ్యవలిసిందల్లా, కుల సంస్కృతిని చీదరించుకోవడమే! దాన్ని నిర్మూలించడమే! (5) 'ఈనాడు చాలా మంది కుల వృత్తులలో లేరనడానికి ఉదాహరణగా, క్షవరం చేసే వృత్తిలో ముస్లిములే చాలామంది వున్నారని వ్యాసకర్త వాదన. అంటే, హిందువుల్లో, కులవృత్తుల్లో వున్నవారు తగ్గిపోయారని, తేల్చే ప్రయత్నం! జనాభా లెక్కల్ని ఆధారం చేసుకుని, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక, 2018 డిసెంబరు 22న ఇచ్చిన వివరాల ప్రకారం, కులం అనేది ఇప్పటికీ, వృత్తుల్ని ఎంచుకోవడంలో, ప్రధానమైన అడ్డంకిగా వుంది అని! ఉత్తరప్రదేశ్‌లో జనాభా లెక్కల ప్రకారం: తోలు పరిశ్రమల్లో (లెదర్ ఇండస్ట్రీస్) పనిచేసే 46 వేల మందిలో, 41 వేల మంది, ఎస్సీ కులస్తులే! అదే సమయంలో, రాజస్తాన్‌లో 76 వేల మంది స్వీపర్లుగా వుంటే, వారిలో 52 వేల మంది ఎస్సీలే! (6) 'అద్వానీ రథయాత్ర సమయంలో, వి.పి.సింగు ప్రభుత్వం మండల్ కమిటీ నివేదికను అమలు చేసిందని' వ్యాసకర్త చేసిన వ్యాఖ్య వాస్తవ విరుద్ధం. ఆ నివేదికను వి.పి.సింగు పార్లమెంటులో ప్రవేశపెట్టినది, రథయాత్రకు పూర్వమే. 1990 ఆగస్టు 7న. రథయాత్ర ప్రకటన వచ్చింది ఒక నెల తర్వాత, సెప్టెంబరు 12న. ఎయిర్ కండిషనర్లు బిగించిన టొయాటో వ్యానుతో 'రథయాత్ర' మొదలైనది, సెప్టెంబరు 25న. (7) కుల గణన వల్ల భారతీయ సంస్కృతీ మూలాలు నశించే అవకాశం వుంది అని వ్యాసకర్త వాపోయారు. కుల వ్యవస్తను సృష్టించినదే హిందూ సంస్కృతి కాబట్టి, కుల గణన వలన భారతీయ సమాజానికి ఏమీ నష్టం జరగదు. ఎందుకంటే, కుల గణన కోరే వారి ఉద్దేశం, కులాల జనాభాని బట్టి ఆర్థిక, రాజకీయ అవకాశాలు పొందాలి అన్నదే! అందుచేత, కులాల నాయకులు ఇప్పుడున్న దోపిడీ రాజ్యాంగ యంత్రంలోనే, అధికారులుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా, పదవులకోసం ప్రయత్నిస్తారు. ఆ ప్రయోజనం కోసం, ఎల్లకాలమూ కులాలు నిలిచివుండేలా చూసుకుంటారు. నష్టం అంటూ జరిగితే, కులాల వారీగా కాకుండా, మతాల వారీగా, అది కూడా, మెజారిటీ మతస్తుల ఓట్లకోసం ప్రయత్నించే మతతత్వ రాజకీయ పార్టీలకి తలనొప్పే. మతతత్వవాద పార్టీలకు కావలిసింది 'మత గణన'. (8) ఈ కులగణనను మార్క్సిస్టులే వెనక వుండి రాజకీయ పార్టీల చేత చేయిస్తున్నారు అని, వ్యాసం చివరిలో, వ్యాసకర్త అనుమానం! అది పూర్తిగా తప్పు. ఎందుకంటే, 'శ్రమ దోపిడీ'ని శ్రామిక వర్గ పోరాటాల ద్వారా నిర్మూలిస్తూ, అసమాన శ్రమ విభజనను మార్చడం ద్వారా కుల వ్యవస్తను కూల్చే లక్ష్యం గల కమ్యూనిస్టులు, కుల గణన మీద భ్రమలు పెట్టుకోరు! 'వర్గ గణన' మీద ఆధారపడి, వారు తమ కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. అలాగే, "మనమంతా హిందువులం! మనమంతా బంధువులం!" అనే నినాదంతో, కుల గణనను వ్యతిరేకించే పార్టీలను నమ్మవద్దని కూడా శ్రామిక జనాలకు కమ్యూనిస్టులు వివరిస్తారు. (9) ఆరెస్సెస్ వాళ్ళూ, బీజేపీ వాళ్ళూ తరుచుగా జపించే 'భారతీయ సంస్కృతి', 'జాతీయ భావన' అనే మాటలు, ఈ వ్యాసంలో కూడా కనిపించాయి. వాస్తవంలో, హిందూ మతస్తులందరూ, భారతీయ సమాజం అంతా, ఒకే రాయితో చేసిన శిల్పం కాదు. ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ, అన్ని సమాజాల్లోనూ, అన్ని మతాల్లోనూ వున్నట్టే, ఇక్కడా ధనిక-పేద తేడాలూ, స్త్రీ-పురుష అసమానత్వమూ, మూఢ నమ్మకాలూ, ఇలా అన్ని చెడుగులూ వున్నాయి. కౌళ్ళూ అనే 'శ్రమ దోపిడీ' ఆదాయాల మీద బ్రతికే సంస్కృతే, దోపిడీ వర్గానికి మూలం! ఏదో ఒక రకమైన శ్రమ చేస్తూ, జీతాల మీద బ్రతికే పేదల సంస్కృతీ వుంది. అలాంటప్పుడు భారతీయ సంస్కృతి, ఇతర దేశాల సంస్కృతి నించీ వేరుగా వుండదు. (10) "కులగణన వల్ల ఎవరికి లాభం?" అని ప్రశ్నించిన వ్యాసకర్తకి, మత గణన వల్ల ఎవరికి లాభం? అని కూడా ప్రశ్నించాలని తోచలేదు. 2022లో, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, బీజేపీ రాజ'యోగి' (ముఖ్యమంత్రి), 'ఈ ఎన్నికలు 80 శాతానికీ, 20 శాతానికీ మధ్య పోరాటం!' అనడం, 'మత గణన' దృష్టితో కాదా? ఇలాంటి ప్రకటనలు, దేశ ప్రజల్ని కలిపి వుంచుతాయా, విభజిస్తాయా?

# స్వచ్ఛబడిని చూసొద్దాం...

## - మున్సిపాలిటీ సేకరిస్తున్న చెత్తపై అవగాహన




**సిద్దిపేట :** చెత్త పనికి రాకుండా పోదని, దాంతో ఆదాయం పొందొచ్చని 2021లో సిద్దిపేటలో 'స్వచ్ఛబడి'కి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు ఈ స్వచ్ఛబడి రాష్ట్రంతో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. పట్టణంలో 43 వార్డుల్లో ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి హానికర చెత్తను సేకరించి 39వ వార్డులో ఏర్పాటైన స్వచ్ఛబడి ఆర్‌ఆర్‌ఆర్‌ఆర్ (రీయూజ్, రెడ్యూజ్, రీసైకిల్, రెఫ్యూజ్)పేరుతో సరికొత్త అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటుంది. చెత్తపై పాఠాలు చెబుతుండడంతో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులే కాకుండా ఇతర జిల్లాలు విద్యార్థులు కూడా వస్తున్నారు. అలాగే రాష్ట్రాలు, కేంద్రం నుంచి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, వీవీఐపీలు స్వచ్ఛబడిలో పాఠాలు వినేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సిద్దిపేటలోని 43 వార్డుల్లో సేకరిస్తున్న తడి, పొడి, హానికర చెత్తను మున్సిపల్ సిబ్బంది ఏం చేస్తున్నారు. వాటిని ఎక్కడకు తీసుకెళ్తున్నారు. వాటితో ఏమేమి తయారు చేస్తారు అన్న దానిపై స్వచ్ఛబడి కేంద్రంగా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. సిద్దిపేట అభివృద్ధిని చూసేందుకు వచ్చిన వారికి స్వచ్ఛబడి కార్యాలయంలో డిజిటల్ క్లాస్ ద్వారా మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, స్థానిక వార్డు కౌన్సిలర్ దీప్తినాగరాజు, పర్యావరణ ప్రేమికురాలు డాక్టర్ శాంతి అవగాహన కల్పిస్తున్నారు. స్వచ్ఛతపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. రెండేళ్ల నుంచి దాదాపు 7వేల మంది విద్యార్థులు, 6 వేలకు పైగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వంద మందికి పైగా వీవీఐపీలు స్వచ్ఛబడిని సందర్శించారంటే ఇక్కడ చెప్పే పాఠాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. పట్టణంలోని కేవలం 39 వార్డులో ఇంటింటి నుంచి సేకరించిన తడి చెత్తతో స్వచ్ఛబడిలో వర్మి కంపోస్టును తయారు చేస్తున్నారు. వార్డులో సేకరించిన దాదాపు క్వింటాల్‌న్నర తడిచెత్తను స్థానిక స్వచ్ఛబడికి తరలిస్తారు. అక్కడ వివిధ పద్ధతుల ద్వారా ఎరువును తయారు చేస్తున్నారు.

# అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం....



**సంగారెడ్డి :** జిల్లాలో అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టర్‌తో కలిసి అన్నిశాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్రమ మైనింగ్‌పై ఇప్పటివరకు సేకరించిన వివరాలు, తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసుశాఖలు సమన్వయంతో పనిచేసి అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఆర్డీవో సక్రమంగా వ్యవహంచడం లేదంటూ మంత్రి అసహనం వ్యక్తం చేశారు. పటాన్‌చెరు ప్రాంతం నుంచి రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్లు కంకర, ఇసుక తరలిపోతున్నా ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. విలువైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూశాఖదేనని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో ప్రభుత్వ భూములు, జలవనరులు అన్యాక్రాంతం కాకుండా అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు. అక్రమ మైనింగ్, ప్రభుత్వ భూములు, నీటి వనరుల ఆక్రమణలను అరికట్టడంపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని వివరించారు. ప్రభుత్వ ఆస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలన్నారు.

# షుగర్ పేషెంట్స్ ఈ ఒక్క పండు తింటే చాలు.....



ప్రస్తుత రోజుల్లో వయసుతో సంబంధం లేకుండా చాలామంది డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసిందే. కాగా షుగర్ రావడానికి అనేక కారణాలు ఉండగా అందులో ప్రధాన కారణం మన ఆహారపు అలవాట్లే అని చెప్పవచ్చు. అయితే డయాబెటిస్ ఉన్నవారు దానిని అదుపులో ఉంచుకోవడానికి ఎన్నో రకాల మెడిసిన్స్ ని ఉపయోగిస్తూ ఉంటారు. కొందరు వంటింటి చిట్కాలను కూడా ఉపయోగించి కూడా షుగర్ ని కంట్రోల్ లో ఉంచుకుంటూ ఉంటారు. అయినా కూడా షుగర్ ఎక్కడం తగ్గడం లాంటివి జరుగుతూ ఉంటాయి. అయితే ఆ సమస్యలకు చెక్ పెట్టాలి అంటే ఈ ఒక్క పండు తినాల్సిందే అంటున్నారు వైద్యులు.ఆ పండు ఏంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ఆ పండు మరేదో కాదు జామ పండు. జామ పండు వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ముఖ్యంగా జామ పండు షుగర్ వ్యాధిగ్రస్తులకు ఎంతో బాగా ఉపయోగపడుతుంది. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిని తరచూ తీసుకోవడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు రోజు రెగ్యులర్గా తీసుకోవడం ద్వారా షుగర్ని తగ్గించుకోవచ్చు. చాలా ఎఫెక్ట్ గా తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా ఇన్సులిన్ ఉత్పత్తి కార్యము కూడా బ్లడ్ షుగర్ లెవెల్స్ ను జామకాయ బాగా పనిచేస్తుంది. ఇందులో విటమిన్ సి అలాగే పుష్కలంగా ఉంటుంది. కంటి సమస్యలు కొన్ని రకాల క్యాన్సర్లు రాకుండా జామపండు కాపాడుతుంది. స్త్రీలలో రుతు చక్ర సమస్యలు బ్రెస్ట్ క్యాన్సర్, పురుషులలో రాకుండా నివారిస్తుంది. జామ పండు ప్రతిరోజు తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. దీనిలో విటమిన్స్ ఊపిరితిత్తులకు చర్మానికి కంటికి చాలా మంచిది.

దీనిలో ఉన్న పొటాషియం గుండె జబ్బులు బిపి పెరగకుండా చేస్తాయి. అంతేకాకుండా జామకాయలు ప్రతిరోజు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జామ పండులోని 50 గ్రాముల గుర్జు పది గ్రాముల తేనెని కలిపి తీసుకుంటే శరీరంలో శక్తి పుంజుకుంటుంది.

# నల్లగా ఉన్నాయని విసుక్కునేరు....!


ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. అందుకే మంచి ఆరోగ్యాన్ని సొంతం చేసుకునేందుకు ఉత్తమమైన జీవనశైలి అవలంభించడంతోపాటు.. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. అయితే, ఆరోగ్యవంతంగా ఉండేందుకు మినుములు బాగా సహాయపడతాయి.. అందుకే.. మినుములు తింటే ఇనుమంత బలం చేకూరుతుంది.. అని పెద్దలు చెబుతుంటారు. మినుముల్లోని పోషకాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతోపాటు.. అనేక రోగాల నుంచి కాపాడతాయి. మినుములు జీర్ణక్రియ, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటిల్లో ఫైబర్, పొటాషియం, ఆరోగ్యకమైన కొవ్వుతోపాటు.. విటమిన్ సీ, విటమిన్ బీ- కాంప్లెక్స్‌లోని బీ1, బీ3 తోపాటు.. కాల్షియం, మెగ్నిషియం, ఐరన్ వంటివి పుష్కలంగా ఉంటాయి. మినుములు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకోండి..

జీర్ణక్రియ: మినుములను నిత్యం ఆహార పదార్థాల్లో ఉపయోగించడం వల్ల జీర్ణక్రియ ప్రక్రియ మెరుగుపడుతుంది. మినుముల్లో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది.. కావున ఇది మలబద్దకం, ఉబ్బసం లాంటి సమస్యలను తగ్గిస్తుంది. సాధ్యమైనంతమేరకు కడుపు సమస్యలు తగ్గేలా చేస్తాయి. డయాబెటిస్: మినుముల్లో ఉండే పోషకాలు ఆరోగ్యవంతంగా ఉండేలా చేస్తాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు.. రక్తహీనతను దూరం చేస్తుంది. అంతేకాకుండా చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతాయి. ఇన్సులిన్, గ్లూకోజ్ స్థాయిలను సమతుల్యం చేసి.. డయాబెటిస్ సమస్య తలెత్తకుండా చేస్తాయి. ఎముకలు: మినుముల్లో కాల్షియం, భాస్వరం, పొటాషియం, ఐరన్, మెగ్నీషియం వంటివి పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎముకలు బలంగా, ధృఢంగా మారడానికి సహాయపడతాయి. ఎముకలు విరిగిన వారు, కీళ్లవాతం, ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న




వారు వీటిని తినడం మంచింది. మంటను తగ్గిస్తాయి: మినుముల్లో మంటను తగ్గించే యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలున్నాయి. గాయాలు, నొప్పులతో బాధపడుతున్న వారికి మినుములతో తయారు చేసిన ఆహారం వడ్డిస్తే మంచిది. వీటిలోని పోషకాల వల్ల చర్మ సౌందర్యం కూడా పెరుగుతుంది.

# స్టార్ ఫ్రూట్ ప్రయోజనాలు...!




పేరుగా తగినట్టుగానే స్టార్ ఫ్రూట్ నక్షత్రం ఆకారంలో ఉంటుంది. రుచిలో కాస్త పుల్ల పుల్లగా, తియ్య తియ్యగా ఉంటుంది. దాని విలక్షణమైన రుచితో పాటు, స్టార్ ఫ్రూట్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంది. జీర్ణక్రియను మెరుగుపరచడం నుండి గుండె ఆరోగ్యంగా ఉంచడం వరకు, ఈ పండు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. స్టార్ ఫ్రూట్ యొక్క ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. బరువు తగ్గడానికి: మీరు బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నట్లయితే స్టార్ ఫ్రూట్ బెస్ట్ ఆప్షన్ అవుతుంది. ఫైబర్ పుష్కలంగా ఉండే ఈ పండులో కేలరీలు చాలా తక్కువ. ఇది మీకు ఎక్కువసేపు ఆకలిని కంట్రోల్ చేస్తుంది. దాంతో అతిగా తినడాన్ని తగ్గిస్తుంది. న్యూట్రీషియన్ రిచ్: స్టార్ ఫ్రూట్ లో న్యూట్రీషియన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో విటమిన్ సి మరియు పొటాషియం ఉంటాయి. స్టార్ ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కూడా ఉన్నాయి. శరీరానికి కావల్సిన పోషకాలు అందడంలో ఇది గ్రేట్ గా సహాయపడుతుంది.

# ఎండుద్రాక్ష వల్ల కలిగే లాభాలు



ఎండు ద్రాక్ష వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం అందరికి తెలిసిందే. ఎండు ద్రాక్ష ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే వైద్యులు కూడా తరచూ ఎండు ద్రాక్షని తినమని చెబుతూ ఉంటారు..అయితే ఈ ఎండు ద్రాక్ష వల్ల కలిగే జాగ్రత్తలు ప్రయోజనాల గురించి చాలామందికి తెలియక వాటిని తినడం మానేస్తూ ఉంటారు. కానీ వాటి వల్ల కలిగే లాభాల గురించి తెలిస్తే మాత్రం వెంటనే కొనుగోలు చేసి తినడం మొదలుపెడతారు. మరి ఎండు ద్రాక్ష వల్ల కలిగే లాభాల విషయానికొస్తే.. ఎండు ద్రాక్ష ఒక బెస్ట్ ఆంటీ ఆక్సిడెంట్ గా పని చేస్తాయి. ఇంకా ఈ ఎండు ద్రాక్షాలను పరిమితంగా తింటే ఫ్యాట్ కొలెస్ట్రాల వంటి సమస్యలు కూడా దరిచెరవు. ఎండు ద్రాక్షాలు అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఎండు ద్రాక్షాలు ఐరన్ పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ అధికంగా ఉంటాయి. అందువల్ల ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. అంతేకాదు ఎండు ద్రాక్షాలు నేచురల్ షుగర్స్ అత్యద్భుతంగా ఉన్నాయి. ఎండు ద్రాక్షలో కూడా వివిధ రకాలు ఉంటాయి. వాటిలో గోల్డెన్ కలర్ వి గ్రీన్ కలర్ వి అలాగే బ్లాక్ కలర్ వి ఇలా దొరుకుతూ ఉంటాయి. మీరు ఏది తీసుకున్నా పోషకాలు ఒకేలా ఉంటాయి. ఈ ఎండుద్రాక్ష తీసుకోవడం వల్ల కార్బోహైడ్రేట్లు నాచురల్ షుగర్లతో ఎండు ద్రాక్షాలో నిండు ఉంటాయి. కాబట్టి ప్రతిరోజు కొన్ని ఎండు ద్రాక్షాలు తినడం వల్ల మన శరీరానికి కావాల్సినంత శక్తి అందుతుంది. అంటే ఇన్స్టెంట్గా శక్తి వస్తుంది. ఇక బరువు తగ్గాలి అనుకునే వారికి ఎండు ద్రాక్షాలు మంచి ఆప్షన్ ఇవి ప్రతిరోజు తింటే బరువు తగ్గుతారు. కాబట్టి మీరు బరువు తగ్గడానికి ఏమైనా డైటింగ్ చేస్తుంటే మీ డైకిషన్ లేదా మీ డాక్టర్ సలహా మేరకు ఎండు ద్రాక్ష కూడా మీ డైట్ లో చేర్చండి. ఎండు ద్రాక్షాలు వంటల్లో వాడుతూ ఉంటారు. కొంతమంది నేరుగా తింటూ ఉంటారు. వీటికంటే కూడా నీటిలో నానబెట్టి తినడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు పొందుకోవచ్చు. నీటిలో నానబెట్టిన ఎండు ద్రాక్షాలు తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. దీనికి ఏం చేయాలి అంటే ఒక ఎనిమిది నుండి 10 ఎండుద్రాక్షలను శుభ్రంగా వాష్ చేసి ఒక గ్లాసు గాని ఒక చిన్న గిన్నెలో గాని వేసి నీళ్లు పోసి నాన్ననివ్వండి. వీటిని ఉదయం మిక్సీలో వేసి గ్రైండ్ చేసుకుని పాలలో కలుపుకుని తాగొచ్చు. లేదా నమిలి తినడం వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. అలా నమిలి తిన్న తర్వాత ఈ నీటిని పడబోయకండి. పరగడుపున ఈ నీటిని తాగితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందుకుంటారు.

# బెండకాయతో ఎన్నో లాభాలు...?



బెండకాయ వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. చాలా వరకు ప్రతి ఒక్కరు కూడా బెండకాయను ఇష్టంగా తింటూ ఉంటారు. కొందరు వంటకాలలో వేసుకొని తింటే మరికొందరు పచ్చిగా కూడా తింటూ ఉంటారు. బెండకాయలో విటమిన్ సి పొటాషియం, క్యాల్షియం, కార్బోహైడ్రేట్లు ఫైబర్ ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఆరోగ్యానికి ఇది చాలా మంచిది. కాగా బెండకాయ వల్ల ఆరోగ్యానికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం తెలిసిందే. బెండకాయలు తరచుగా తీసుకోవడం వల్ల ఎన్నో సమస్యలకు చెక్ పెట్టవచ్చు.


# దగ్గు సమస్య వేధిస్తోందా....?

మామూలుగా చాలామందికి సీజన్ తో సంబంధం లేకుండా దగ్గు సమస్య ఇబ్బంది పడుతూ ఉంటుంది. ముఖ్యంగా దగ్గు జలుబు కారణంగా తీవ్ర ఇబ్బంది పడుతూ ఉంటారు. జలుబు సంగతి పక్కన పెడితే దగ్గు సమస్య కారణంగా చాలా ఇబ్బంది పడటంతో పాటు రాత్రిలో నిద్రపోవడానికి కూడా కష్టపడుతూ ఉంటారు. ముఖ్యంగా వర్షాకాలం, శీతాకాలంలో ఆరోగ్య పరిస్థితిలో కొంచెం ఎక్కువగా ఉంటాయి. చాలామంది వీటిలో ఎక్కువగా దగ్గు జలుబు జ్వరం వస్తూ ఉంటుంది. చాలామందికి అయితే ఈ దగ్గు జలుబు వంటివి కొన్ని రోజులు ఉండి తగ్గిపోతే పర్వాలేదు. కానీ ఎక్కువ రోజులు అంటే వారాల తరబడి ఉంటే గనుక కచ్చితంగా డాక్టర్ ని సంప్రదించాల్సిందే. కొంతమందికి అయితే దగ్గు కనీసం ఊపిరి ఆడనివ్వకుండా తరచుగా వస్తూ ఉంటుంది. ఈ దగ్గు సమస్య కొన్ని కొన్ని సార్లు ప్రాణాంతకంగా కూడా మారొచ్చు. అలాంటప్పుడు ఇంట్లోనే దొరికే కొన్నింటిని ఉపయోగించి ఆ దగ్గు సమస్యకు చెప్పి పెట్టవచ్చు. మరి అందుకోసం ఏం చేయాలి అన్న విషయానికి వస్తే.. ఒక్క తమలపాకు ఒక చిటికెడు వాముతో దగ్గు సమస్య పూర్తిగా పరారైపోతుంది. రోజు తమలపాకు వాము కలిపి వేసుకోవాలి. ఇలా తినడం వలన తలనొప్పి, అధిక ఒత్తిడి వంటి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. మనసు,



మెదడు ప్రశాంతంగా ఉంటాయి. నోటి దుర్వాసన సమస్యతో ఇబ్బంది పడేవారు రోజు తమలపాకు వాము చేర్చి తింటే నోటిలో పేరుకుపోయిన బ్యాక్టీరియా నాశనమై బ్యాడ్ స్మెల్ రావడం తగ్గుతుంది..తమలపాకు ఎంత దివ్య ఔషధంగా పనిచేస్తుందో మరి ఇప్పుడు దగ్గు కోసం తమలపాకును ఎలా వాడాలి అన్న విషయానికి వస్తే.. ముందుగా ఒక తమలపాకును తీసుకుని శుభ్రంగా కడిగి, అలా కడిగిన తర్వాత రెండు చివర్లు కట్ చేయాలి. దానిలో ఒక స్పూను వాముని చేర్చి దానిని మడత పెట్టి ప్రతిరోజు తినాలి. ఇలా తినడం వలన దగ్గు సమస్య నుంచి త్వరగా ఉపశమనం పొందవచ్చు.

# అలాంటి సమస్యలతో బాధపడుతున్నారా..



మామూలుగా బ్లాక్ సాల్ట్ చాలా తక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు. వైట్ సాల్ట్ తో పోల్చుకుంటే బ్లాక్ సాల్ట్ వల్లనే ఎక్కువగా ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే కొన్ని రకాల సమస్యలు ఉన్నవారు బ్లాక్ సాల్ట్ తీసుకోవడం వల్ల ఆ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. మరి బ్లాక్ సాల్ట్ వల్ల కలిగే ప్రయోజనాల విషయానికి వస్తే. తెల్ల ఉప్పును ఇళ్లలో ఉపయోగిస్తారో అలాగే, నల్ల ఉప్పును కూడా కొందరు ఉపయోగిస్తారు. బ్లాక్ సాల్ట్ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు కలిగిన బ్లాక్ సాల్ట్ ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుంది. బ్లాక్ సాల్ట్‌లో అనేక యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. కాగా నల్ల ఉప్పు తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. బ్లాక్ సాల్ట్ తినడం వల్ల ఎసిడిటీ, కడుపు ఉబ్బరం తగ్గుతాయి. ఇది మీ కాలేయానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీనిని ఆహారంలో ఉపయోగించడం వల్ల గ్యాస్ సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. నల్ల ఉప్పు డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. దీన్ని తక్కువ పరిమాణంలో ఉపయోగించడం వల్ల రక్తపోటు కూడా అదుపులో ఉంటుంది. నల్ల ఉప్పు జీర్ణక్రియకు చాలా ఉపయోగకరం. దీనిని తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది మీ కడుపుని బాగా శుభ్రపరుస్తుంది. నల్ల ఉప్పును నీటిలో కలుపుకుని తాగితే, అది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నల్ల ఉప్పులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది.

# దేవర విడుదలపై క్లారిటీ వచ్చేది అప్పుడే...




'ఆర్ఆర్ఆర్' తర్వాత తారక్ ఇమేజ్ పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు ఆయన పాన్ వరల్డ్ స్టార్. అందుకే దాదాపు 300కోట్ల భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ రేంజ్‌లో 'దేవర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు నిర్మాతలు నందమూరి కల్యాణ్‌రామ్, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ కెన్నీ బేట్స్ తీర్చిదిద్దిన పోరాటలు సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇందులోని అండర్‌వాటర్ సీక్వెన్స్ కోసం జోడించిన వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులను అద్భుతమైన అనుభూతికి లోనుచేస్తాయని వారు అంటున్నారు. ఇదిలావుంటే ఈ సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేయాలని నిర్మాతలు భావించిన విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా షూటింగ్ సమయంలో ఇందులో విలన్‌గా నటిస్తున్న సైఫ్ అలీఖాన్ గాయపడటంతో షూటింగ్ కాస్త జాప్యం జరిగింది. దాంతో విడుదల తేదీని కూడా వాయిదా వేశారు. సైఫ్ విశ్రాంతిలో ఉండటంతో ఆయన లేని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు కొరటాల. సైఫ్ వస్తే మిగతా టాకీ కూడా పూర్తి చేస్తారు. అప్పుడుకానీ విడుదల తేదీపై క్లారిటీ రాదని మేకర్స్ తెలిపారు. ఇప్పటికే మాంటేజస్ సాంగ్ చిత్రీకరణ పూర్తయింది. నాలుగు పాటల చిత్రీకరణ మిగిలివుంది. ఇందులో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

# అరుదైన ఘనత



కన్నడ సోయగం రష్మిక మందన్న తిరుగులేని విజయాలతో దూసుకుపోతున్నది. 'పుష్ప' చిత్రంలో శ్రీవల్లి పాత్రతో దేశవ్యాప్తంగా యువతరానికి చేరువకావడమే కాకుండా నేషనల్ క్రష్‌గా పేరు తెచ్చుకుంది. ఇటీవల విడుదలైన 'యానిమల్' సినిమాలో గీతాంజలి పాత్రలో అద్భుత అభినయంతో మరింత పేరు సంపాదించుకుంది. తాజాగా ఈ అమ్మడు మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రకటించిన 'ఫోర్బ్స్ ఇండియా అండర్ 30' జాబితాలో అగ్ర స్థానంలో నిలిచింది. వివిధ రంగాల్లో విశేషంగా రాణిస్తున్న 30 ఏళ్ల లోపు ప్రతిభావంతుల జాబితాను ఫోర్బ్స్ విడుదల చేయగా..అందులో రష్మిక మందన్న అగ్ర స్థానాన్ని దక్కించుకుంది. ఈ విషయాన్ని ట్విటర్ వేదికగా తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేసింది రష్మిక మందన్న. ప్రస్తుతం ఈ భామ 'పుష్ప-2' షూటింగ్‌లో పాల్గొంటున్నది. ధనుష్-నాగార్జున మల్టీస్టారర్‌లో కూడా రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్నది.

## మాళవిక మోహనన్ అందాల మెరుపులు



# బెర్లిన్‌కు పయనమైన బన్నీ




తెలుగు సినీచరిత్రలో ఉత్తమనటుడిగా జాతీయ పురస్కారం అందుకున్న తొలి హీరో అల్లు అర్జున్. 'పుష్ప' సినిమాకు గాను ఆయన జాతీయ ఉత్తమనటుడిగా నేషనల్ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. తాజాగా బన్నీ మరో అరుదైన గౌరవాన్ని పొందారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో భారతీయ సినిమా తరపున ప్రాతినిధ్యం వహించే అద్భుతమైన అవకాశం అల్లు అర్జున్‌ని వరించింది. ఈ సందర్భంగా బెర్లిన్‌లో జరిగే 74వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో పాల్గొనేందుకు గురువారం జర్మనీ వెళ్లారు బన్నీ. ఇది నిజంగా బన్నీ కెరీర్‌లో హిస్టారికల్ మూమెంట్ అని చెప్పాలి. ఇదిలావుంటే.. ఆయన నటిస్తున్న 'పుష్పా2' సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలే ఉన్నాయి. ఈ సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానున్న విషయం తెలిసిందే.

# కారు కొనుగోలుదారులకు గుడ్ న్యూస్.. నిరీక్షణకు ఇక తెర




మిడ్ రేంజ్ కార్లు కొనాలని భావిస్తున్నారా? ధర కొంచెం ఎక్కువైనా మంచి పనితీరు కలిగిన కార్లు కావాలనుకుంటున్నారా? అయితే ఈ కథనం మీకోసమే. ఈ ఏడాదిలో టాప్ బ్రాండ్లను నుంచి బెస్ట్ మోడళ్లు మార్కెట్లోకి లాంచ్ అయ్యాయి. మరికొన్ని లాంచ్ అయ్యేందుకు రెడీగా ఉన్నాయి. వాటి ధరల రేంజ్ రూ. 20లక్షల నుంచి మొదలై రూ. 40లక్షల వరకూ ఉంటాయి. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం. మిడ్ రేంజ్ కార్లు కొనాలని భావిస్తున్నారా? ధర కొంచెం ఎక్కువైనా మంచి పనితీరు కలిగిన కార్లు కావాలనుకుంటున్నారా? అయితే ఈ కథనం మీకోసమే. ఈ ఏడాదిలో టాప్ బ్రాండ్లను నుంచి బెస్ట్ మోడళ్లు మార్కెట్లోకి లాంచ్ అయ్యాయి. మరికొన్ని లాంచ్ అయ్యేందుకు రెడీగా ఉన్నాయి. వాటి ధరల రేంజ్ రూ. 20లక్షల నుంచి మొదలై రూ. 40లక్షల వరకూ ఉంటాయి. వాటిల్లో హ్యూందాయ్ క్రెటా, మహీంద్రా థార్, వోక్స్‌వ్యాగన్ టైగూన్, హ్యూందాయ్ అల్కాజార్, హ్యూందాయ్ టక్సన్ వంటి మోడళ్లు ఉన్నాయి. వీటిలో హై ఎండ్ ఫీచర్లతో పాటు టాప్ స్పెక్స్ ఉంటాయి. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.

**హ్యూందాయ్ క్రెటా..**

2020లో భారతదేశంలో లాంచ్ అయిన ఈ కారు రెండవ తరం ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. మునుపటి రాడికల్ స్టైలింగ్‌తో పోలిస్తే విశ్వవ్యాప్తంగా ఆకట్టుకునే డిజైన్‌ను కలిగి ఉంది. ప్రీమియం ఫీల్ పరంగా క్యాబిన్ పెరిగింది. ఫీచర్ అప్‌డేట్‌లలో 10.25-అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, 360 డిగ్రీ కెమెరా, డ్యూయల్-జోన్ క్లైమేట్ కంట్రోల్, అడాస్ ఉన్నాయి. అవుట్‌గోయింగ్ మోడల్ నుంచి పెట్రోల్, డీజిల్ పవర్‌ట్రైన్ ఆప్షన్లను అలాగే ఉంచింది. కొత్త క్రెటా 1.5-లీటర్ టర్బో పెట్రోల్ యూనిట్ (160 పీఎస్/253 ఎన్ఎం)ని పొందుతుంది, ప్రత్యేకంగా డీసీటీ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో వస్తోంది. దీని ధరల రేంజ్ రూ. 11లక్షల నుంచి ప్రారంభమై రూ. 20.15లక్షల వరకూ ఉంటుంది. ఇది గత నెల 16న మార్కెట్లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది.

## అదంతా ఇన్ఫోసిస్ చేసిందే.. ఐటీ దిగ్గజంపై క్లయింట్ నిందలు




దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ డేటా లీకేజీ నిందలు ఎదుర్కొంటోంది. ఇన్ఫోసిస్ కీలక క్లయింట్లలో ఒకటైన బ్యాంక్ ఆఫ్ అమెరికా తమ 57,028 మంది కస్టమర్లను ప్రభావితం చేసిన సైబర్ దాడుల సంఘటనకు ఇన్ఫోసిస్ మెక్‌కామిష్ సిస్టమ్స్ కారణమని ఆరోపించింది. ఇన్ఫోసిస్ బీపీఎం అనుబంధ సంస్థ అయిన మెక్‌కామిష్ సిస్టమ్స్, గత ఏడాది నవంబర్‌లో జరిగిన సైబర్ సెక్యూరిటీ సంఘటనతో ప్రభావితమైంది. దాని ఫలితంగా నిర్దిష్ట అప్లికేషన్‌లు, సిస్టమ్‌లు అందుబాటులో లేకుండా పోయాయి. ఇన్ఫోసిస్ మెక్‌కామిష్ అనేది ప్లాట్‌ఫారమ్-ఆధారిత బీపీవో సంస్థ. ఇది జీవిత బీమా, యాన్యుటీ ఉత్పత్తులు, రిటైర్‌మెంట్ ప్లాన్‌లకు సంబంధించిన కంపెనీలకు సేవలను అందిస్తుంది. మెక్‌కామిష్ నిర్దిష్ట పరిశ్రమ క్లయింట్‌ల కోసం సాఫ్ట్‌వేర్‌లను పునఃవిక్రయిస్తుంటుంది. ఈ సంస్థను 2009లో ఇన్ఫోసిస్ బీపీఎం (గతంలో ఇన్ఫోసిస్ బీపీవో) కొనుగోలు చేసింది. "2023 నవంబర్ 3 సమయంలో ఇన్ఫోసిస్ మెక్‌కామిష్ సిస్టమ్స్‌లో సైబర్ దాడులు జరిగాయి. ఒక అనధికార థర్డ్ పార్టీ చొరబడి సిస్టమ్‌లను యాక్సెస్ చేసిన ఫలితంగా కొన్ని ఐఎంఎస్ అప్లికేషన్‌లు అందుబాటులో లేకుండా పోయాయి. బ్యాంక్ ఆఫ్ అమెరికా అందించే వ్యత్యాస పరిహారం ప్లాన్‌లకు సంబంధించిన డేటా ప్రభావితమై ఉండవచ్చని 2023 నవంబర్ 24న ఐఎంఎస్ తెలియజేసింది. అయితే బ్యాంక్ సిస్టమ్‌లపై ఎటువంటి ప్రభావం లేదు" అని కస్టమర్‌లకు అందించిన నోటీసులో బ్యాంక్ ఆఫ్ అమెరికా పేర్కొంది.

## లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు గురువారం లాభాల్లో ప్రారంభమయ్యాయి. నిఫ్టీ 62 పాయింట్లు పుంజుకుని 21,900కు చేరింది. సెన్సెక్స్ 180 పాయింట్లు లాభపడి 71,998 వద్ద ట్రేడవుతోంది. ఎఫ్ఐఐలు బుధవారం ఈక్విటీ మార్కెట్‌లో రూ. 3929.6 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. డీఐఐలు రూ. 2897.98 కోట్లు విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. అమెరికా మార్కెట్‌లోని నాస్‌డాక్ బుధవారం ముగింపు సమయానికి 1.3శాతం పెరిగింది. పదేళ్ల కాలపరిమితి ఉన్న యూఎస్ బాండ్‌ఈల్డ్‌లు 5 పాయింట్లు నష్టపోయి 4.27శాతానికి చేరాయి. డాలర్ ఇండెక్స్ 0.26 శాతం నష్టపోయి 104.69 పాయింట్లకు చేరింది. క్రూడాయిల్ ధర 1.5శాతం తగ్గి బ్యారెల్ ధర 81.53 డాలర్లకు చేరింది. రష్యా ఇటీవల ఉక్రెయిన్‌పై జిర్కాన్ హైపర్‌సోనిక్ మిసైల్‌ను ప్రయోగించింది. దాంతో అంతర్జాతీయంగా కొంత అనిశ్చితులు నెలకొంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లు ఈ మధ్యకాలంలో భారీగా ఒడిదొడుకులకు లోనవుతోందని తెలుస్తుంది. అయితే ఇలాంటి సమయంలో ?కొత్తగా మార్కెట్‌లోకి వచ్చినవారు నష్టభయాన్ని తట్టుకోలేక లాస్‌బుక్ చేస్తుంటారు. కానీ స్టాక్ ఫ?ంటమెంటల్స్‌పై పూర్తి అవగాహన ఉండి బిజినెస్ మోడల్‌పై పట్టు ఉంటే దీర్ఘకాలికంగా మంచి లాభాలు పొందొచ్చని నిపుణులు చెబుతున్నారు.

## డాక్టర్ రెడ్డీస్ మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లు

**హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మార్కెట్ విలువ (మార్కెట్ కేపిటలైజేషన్) రూ.లక్ష కోట్లను అధిగమించింది. తద్వారా మరొక అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. స్టాక్ మార్కెట్లో గత ఏడాది కాలంలో డాక్టర్ రెడ్డీస్ షేరు (ముఖ విలువ రూ. 5) కనిష్ఠ ధర రూ. 4,298గా ఉంది. మంగళవారం రూ. 6,411 వద్ద గరిష్ఠ ధర పలికింది. ఇక బుధవారం రూ. 6,259 వద్ద స్థిరపడింది. ఈ ధర ప్రకారం లెక్కిస్తే, కంపెనీ మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లను అధిగమించింది. ఔషధ రంగంలో మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు క్రియాశీలకంగా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ కంపెనీల్లో రూ.లక్ష కోట్ల మార్కెట్ విలువ గల ఫార్మా కంపెనీ ప్రస్తుతం డాక్టర్ రెడ్డీస్ ఒక్కటే కావడం గమనార్హం. ఇతర అగ్రశ్రేణి ఫార్మా కంపెనీలైన దివీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా, గ్లాండ్ ఫార్మా, లారస్ ల్యాబ్స్, మరికొన్ని ఇతర కంపెనీల మార్కెట్ విలువ రూ.లక్ష కోట్ల కంటే తక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా చూస్తే.. అధిక మార్కెట్ విలువ గల ఫార్మా కంపెనీల్లో సన్ ఫార్మా, సిప్లా, డాక్టర్ రెడ్డీస్ మొదటి 3




స్థానాల్లో ఉన్నాయి. సన్ ఫార్మా మార్కెట్ విలువ అత్యధికంగా రూ. 3,65,194 కోట్లు కాగా, రూ. 1,15,097 కోట్లతో సిప్లా రెండో స్థానంలో ఉంది. డాక్టర్ రెడ్డీస్ విలువ రూ. 1,04,416 కోట్లు. రూ.లక్ష కోట్లకు పైగా మార్కెట్ విలువ ఈ మూడు కంపెనీలకే ఉంది. తర్వాతి స్థానాల్లో దివీస్ ల్యాబ్స్ (రూ. 98,703 కోట్లు), టోరెంట్ ఫార్మా (రూ. 88,205 కోట్లు), జైడస్ లైఫ్ (రూ. 87,854 కోట్లు), మ్యాన్‌కైండ్ ఫార్మా (రూ. 88,295 కోట్లు), లుపిన్ (రూ. 73,315 కోట్లు), ఆల్కెమ్ ల్యాబ్స్ (రూ. 62,607 కోట్లు), అబాట్ ఇండియా (రూ. 62,260 కోట్లు) ఉన్నాయి.

## పేటియం తలుపు తట్టిన ఇడి.....!

### మరో 10 శాతం షేర్ పతనం




**న్యూఢిల్లీ :** పేటియం పేమెంట్ బ్యాంక్‌పై నిధుల మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో ఆ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రాథమిక దర్యాప్తును ప్రారంభించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆంక్షలతో ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న పేటియం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తాజాగా ఇడి విచారణ రిపోర్టులతో బెంబేలెత్తుతోంది. మరోవైపు పేటియం షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురైతున్నాయి. ఆర్‌బిఐ సమాచారం మేరకు ఇడి రంగంలోకి దిగిందని తెలుస్తోంది. మనీలాండరింగ్‌కు తోడు విదేశీ నిధుల ఉల్లంఘనలపై ఇడి దర్యాప్తు చేస్తోందని రిపోర్టులు వస్తోన్నాయి. నిధుల దారి మళ్లింపు జరిగినట్లు ఆరోపణలు వస్తే ఇడి దర్యాప్తు చేస్తుందని ఇటీవల కేంద్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి సంజరు మల్హోత్రా పేర్కొన్న విషయం తెలిసిందే. బుధవారం సెషన్‌లోనూ బిఎస్ఇలో వన్97 కమ్యూనికేషన్స్ షేర్ 10 శాతం పతనమై రూ. 342.15 వద్ద ముగిసింది. ఇది జీవిత కాల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. 2023 అక్టోబర్‌లో ఆల్ టైం గరిష్ట స్థాయి రూ. 998 వద్ద నమోదయిన విలువతో పోల్చితే బుధవారం నాటికి 65 శాతం పతనమైంది.

### దాచుకున్నా దోచుకోలేరు...

## కేవలం రూ. 500కే ఈ గోల్డ్ కొనేయొచ్చు




బంగారానికి.. భారతీయ మహిళలకు మధ్య బలమైన బంధముంది. అది మాటల్లో చెప్పలేనిది. మూటల్లో కొలవలేనిది. ఆదా కోసం అనుకోండి.. ఆదాయం కోసం అనుకోండి.. భవిష్యత్ పెట్టుబడిగా అయినా అనుకోండి.. పుత్తడిని కొనాల్సిందే అంటారు. బంగారానికి.. భారతీయ మహిళలకు మధ్య బలమైన బంధముంది. అది మాటల్లో చెప్పలేనిది. మూటల్లో కొలవలేనిది. ఆదా కోసం అనుకోండి.. ఆదాయం కోసం అనుకోండి.. భవిష్యత్ పెట్టుబడిగా అయినా అనుకోండి.. పుత్తడిని కొనాల్సిందే అంటారు. డిజిటల్ గోల్డ్ వచ్చిన తరువాత వేలకు వేలు చేతిలో లేకపోయినా ఓ 500 రూపాయిలు ఉన్నా గోల్డ్ కొనే ఛాన్స్ వచ్చేసింది. ఇక ప్రభుత్వం సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ ను ఎప్పుడైతే అందుబాటులోకి తెచ్చిందో.. దీనికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఇది సక్సెస్ కావడంతో.. ఇప్పుడు అందరి చూపూ దీనిపైనే పడింది. బంగారానికి.. భారతీయ మహిళలకు మధ్య బలమైన బంధముంది. అది మాటల్లో చెప్పలేనిది. మూటల్లో కొలవలేనిది. ఆదా కోసం అనుకోండి.. ఆదాయం కోసం అనుకోండి.. భవిష్యత్ పెట్టుబడిగా అయినా అనుకోండి.. పుత్తడిని కొనాల్సిందే అంటారు. డిజిటల్ గోల్డ్ వచ్చిన తరువాత వేలకు వేలు చేతిలో లేకపోయినా ఓ 500 రూపాయిలు ఉన్నా గోల్డ్ కొనే ఛాన్స్ వచ్చేసింది. ఇక ప్రభుత్వం సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ ను ఎప్పుడైతే అందుబాటులోకి తెచ్చిందో.. దీనికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఇది సక్సెస్ కావడంతో.. ఇప్పుడు అందరి చూపూ దీనిపైనే పడింది. బంగారం కొని ఇంట్లో పెట్టుకోలేరు. అలాగని లాకర్లలో దాచేంత గోల్డ్ ను ఎక్కువమంది కొనలేరు. కొంతమందికి అసలు బంగారం నగలను ధరించడమే ఇష్టముండదు. అలాంటివారందరికీ ది బెస్ట్ ఆప్షన్ సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్. ప్రస్తుతం ఇది ఓపెన్ అయి ఉంది. ఫిబ్రవరి 16 తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో ఇది నాలుగో సిరీస్. ఆర్బీఐ చెప్పిన ప్రకారం చూస్తే.. ఒక గ్రాము గోల్డ్ రేటు 6 వేల 263 రూపాయిలు. ఒకవేళ మీరు ఆన్‌లైన్‌లో కొంటే.. గ్రాముకు 50 రూపాయిలు డిస్కౌంట్ కూడా ఉంటుంది. అంటే అప్పుడు ఒక గ్రాము 6 వేల 213 రూపాయిలకే వస్తుంది. బంగారం కొని ఇంట్లో పెట్టుకోలేరు. అలాగని లాకర్లలో దాచేంత గోల్డ్ ను ఎక్కువమంది కొనలేరు. కొంతమందికి అసలు బంగారం నగలను ధరించడమే ఇష్టముండదు. అలాంటివారందరికీ ది బెస్ట్ ఆప్షన్ సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్. ప్రస్తుతం ఇది ఓపెన్ అయి ఉంది.

## గోల్డ్ ఈటీఎఫ్‌లు ఆకర్షణీయం



**న్యూఢిల్లీ :** గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు) జనవరి నెలల్లో భారీ మొత్తంలో పెట్టుబడుల్ని ఆకర్షించాయి. 2024 జనవరి నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో మదుపుదారులు ఒక్కసారిగా రూ. 657 కోట్లు ఇన్వెస్ట్‌చేసినట్టు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫి) తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంతక్రితం 2023 డిసెంబర్‌లో ఈ పెట్టుబడులు రూ. 88.3 కోట్లే. ద్రవ్యోల్బణం పెరుగుదల, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమ సురక్షిత పెట్టుబడిగా బంగారాన్ని ఎంచుకుంటున్నారని విశ్లేషకులు తెలిపారు. జనవరిలో జరిగిన పెట్టుబడులతో గోల్డ్ ఫండ్స్ నిర్వహించే ఆస్తుల విలువ డిసెంబర్‌తో పోలిస్తే రూ. 27,336 కోట్ల నుంచి రూ. 27,778 కోట్లకు చేరాయి. 2023 డిసెంబర్ తొలినాళ్లలో ప్రపంచ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 2,100 డాలర్లస్థాయిని దాటిన తర్వాత క్రమేపీ తగ్గుతూ వస్తున్నది. రూపాయిల్లో బంగారం గత ఏడాదికాలంగా మంచి రాబడులే ఇచ్చినప్పటికీ, ఈక్విటీలతో పోలిస్తే తక్కువేనని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా అనలిస్ట్ మెల్విన్ శాంటారిటా చెప్పారు. ఈ నేపథ్యంలో వడ్డీ రేట్లు తగ్గుముఖంపడితే బంగారం జోరుగా పెరుగుతుందన్న అంచనాలతో కొంతమంది ఇన్వెస్టర్లు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడికి మొగ్గుచూపుతున్నారని వివరించారు. 2023 మొత్తం సంవత్సరంలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ. 2,920 కోట్ల నిధులు తరలివచ్చాయి. 2022లో వచ్చిన పెట్టుబడులకంటే రూ. 459 కోట్లు అధికంగా ఆకర్షించాయి.

**గోల్డ్ ఈటీఎఫ్‌లు అంటే..**

గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో యూనిట్ల రూపంలో ఇన్వెస్టర్లు మదుపు చేసే నిధుల్ని ఆ ఈటీఎఫ్‌లు తిరిగి బులియన్ మార్కెట్లో బంగారాన్ని కొని వాల్ట్‌ల్లో నిల్వ చేస్తాయి. ఈ యూనిట్లను డిజిటల్ రూపంలో ఇన్వెస్టర్ల డీమ్యాట్ ఖాతాల్లో జమచేస్తారు. లేదా కోరుకున్నవారికి పత్రంగా అందిస్తారు. ఒక యూనిట్ గోల్డ్ ఈటీఎఫ్ ఒక గ్రాము పూర్తి స్వచ్ఛతగల బంగారానికి సమానం. దేశంలో భౌతిక బంగారం ధర ఆధారంగా గోల్డ్ ఈటీఎఫ్ ట్రేడవుతుంది. ఎప్పుడు కావాలంటే ఆ సమయంలో వీటిని విక్రయించుకోవచ్చు.

**600 దిగిన పసిడి ధర**

అమెరికా ద్రవ్యోల్బణం అంచనాల్ని మించి పెరిగిందన్న వార్తలతో ప్రపంచ మార్కెట్లో పుత్తడి ధర హఠాత్తుగా పతనమయ్యింది. కడపటి సమాచారం అందేసరికి స్పాట్ మార్కె ట్లో ఔన్సు బంగారం ధర 28 డాలర్ల మేర క్షీణించి 1,993 డాలర్ల వద్దకు పడిపోయింది. ఒకే రోజున ధర 1.3 శాతం మేర పతనంకావడం గత రెండు నెలల్లో ఇదే ప్రథమం. ప్రపంచ ట్రెండ్‌ను అనుసరిస్తూ దేశీయ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో 10 గ్రాముల పుత్తడి ధర రూ. 600 తగ్గి (0.96 శాతం) రూ. 61,500 వద్దకు దిగింది. రూపాయి క్షీణించిన ప్రభావంతో ప్రపంచ మార్కెట్‌తో పోలిస్తే ఎంసీఎక్స్‌లో ధర తక్కువ తగ్గింది. ఆఫ్‌షోర్ మార్కెట్లో డాలరు ఇండెక్స్ 104.6 స్థాయికి పెరిగిన నేపథ్యంలో రూపాయి మారకపు విలువ 10 పైసలు పడిపోయింది. ఇదే ట్రెండ్ అమెరికా మార్కెట్లో కొనసాగితే బుధవారం మన దేశంలోని స్పాట్ మార్కెట్లో సైతం పుత్తడి ధర 62, 500 దిగువకు తగ్గే అవకాశం ఉంటుం ది. మంగళవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 62,840 వద్ద ముగిసింది. అంతక్రితం 2023 డిసెంబర్‌లో ఈ పెట్టుబడులు రూ. 88.3 కోట్లే. ద్రవ్యోల్బణం పెరుగుదల, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమ సురక్షిత పెట్టుబడిగా బంగారాన్ని ఎంచుకుంటున్నారని విశ్లేషకులు తెలిపారు. జనవరిలో జరిగిన పెట్టుబడులతో గోల్డ్ ఫండ్స్ నిర్వహించే ఆస్తుల విలువ డిసెంబర్‌తో పోలిస్తే రూ. 27,336 కోట్ల నుంచి రూ. 27,778 కోట్లకు చేరాయి.

గరుడ వార్త



# కాంగ్రెస్ ఖాతాలు స్తంభన...

న్యూఢిల్లీ : రూ. 210 కోట్ల మేరకు ఆదాయపు పన్ను (ఐటి) శాఖ డిమాండ్ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన బ్యాంక్ ఖాతాలను శుక్రవారం స్తంభింపచేశారు. అయితే, వచ్చే వారం మరింత విచారణ జరిగేంత వరకు ఖాతాల నిర్వహణకు ఐటి అప్పిలేట్ ట్రైబ్యునల్ పార్టీకి ఆ తరువాత అనుమతి ఇచ్చింది. దీనితో పార్టీకి పెద్ద ఎత్తున ఉపశమనం కలిగినట్లయింది. ఐటి శాఖ చర్య రాజకీయ కార్యకలాపాలను ప్రభావితం చేసిందని పార్టీ వ్యాఖ్యానించింది. ఐటి శాఖ అధికారులు తమ ఖాతాలను స్తంభింపచేశారని ప్రకటించేందుకు అంతకు ముందు పత్రికా గోష్ఠిలో ప్రసంగించిన కాంగ్రెస్ కోశాధికారి అజయ్ మాకెన్ ఐటి అప్పిలేట్ ట్రైబ్యునల్ తమ ఖాతాలపై రూ. 115 కోట్లు పరిమితి విధించిందని, ఆ పరిమితికి మించి ఖర్చు చేయడానికి పార్టీకి అనుమతి లభించిందని తెలియజేశారు. ఐటి శాఖ ఉత్తర్వుపై ట్రైబ్యునల్ ముందు హాజరైన పార్టీ నేత వివేక్ తనా? ఆ తరువాత విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ ఖాతాలు స్తంభనలో ఉండిపోయినట్లయితే 'ఎన్నికల ఉత్సవం'లో కాంగ్రెస్ పాల్గొనజాలదని తాను ట్రైబ్యునల్‌కు సూచించినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై తుది నిర్ణయం తీసుకునే ముందు ట్రైబ్యునల్ వచ్చే బుధవారం విచారణ జరుగుతుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సహా పలువురు పార్టీ నేతలు ఐటి శాఖ చర్యపై అమిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్య ప్రజాస్వామ్యంపై దాడి అని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని అన్న మాకెన్ ట్రైబ్యునల్ ఉత్తర్వుపై వివరణ ఇచ్చారు. 'మా పిటిషన్‌ను పురస్కరించుకుని మేము బ్యాంకులలో రూ. 115 కోట్లు అట్టిపెట్టవలసి ఉంటుందని ఆదాయపు పన్ను శాఖ, ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఐటిఎటి) స్పష్టం చేశాయి. బ్యాంకు ఖాతాలలో ఆ రూ. 115 కోట్లను కనీస మొత్తంగా ఉంచాలి' అని ఆయన తెలిపారు. 'మేము దానికి మించి ఖర్చు చేయవచ్చు' అని మాకెన్ 'ప్రజాస్వామ్యం స్తంభన' అన్న హ్యాష్‌ట్యాగ్‌తో 'ఎక్స్' పోస్ట్‌లో సూచించారు. 'అంటే ఆ రూ. 115 కోట్లను స్తంభింపచేశారు. ఆ



రూ. 115 కోట్లు మా కరెంట్ అకౌంట్లలో ఉన్న మొత్తం కన్నా ఎంతో ఎక్కువ' అని ఆయన వివరించారు. 'కుంటి సాకుతో' తమ ఖాతాలను స్తంభింపచేయడం సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు రెండు వారాలు కూడా సమయం లేనప్పుడు సకల రాజకీయ కార్యకలాపాలనూ ప్రభావితం చేసింది' అని కాంగ్రెస్ కోశాధికారి అంతకుముందు చెప్పారు. భారతీయ యువజన కాంగ్రెస్ (ఐవైసి)తో సహా ఆ ఖాతాలను ఎన్నికల సంవత్సరం 2018౼19కి సబంధించిన ఆదాయపు పన్ను శాఖ డిమాండ్‌పై స్తంభింపచేశారని మాకెన్ తెలిపారు. ఆ ఏడాదికి సంబంధించిన ఐటి రిటర్న్‌లను పార్టీ కొన్ని రోజులు ఆలస్యంగా దాఖలు చేసిందని ఆయన తెలిపారు. తమ వేతనాల నుంచి విరాళాలుగా పార్టీ ఎంఎల్‌ఎలు, ఎంపిలు పార్టీకి ఇచ్చిన రూ. 14.4 కోట్ల నగదు రసీదులలో ఒక లోపానికి సంబంధించినది ఈ వ్యవహారం అని ఆయన వివరించారు. ఖాతాల స్తంభనకు సంబంధించిన ఐటి అధికారులు ఉత్తర్వు బుధవారం వచ్చినట్లు ఆయన తెలిపారు. నాలుగు ప్రధాన బ్యాంక్ ఖాతాల స్తంభన జరిగిందని మాకెన్ చెప్పగా పార్టీ వర్గాలు ఆ తరువాత ఆ సంఖ్యను తొమ్మిదిగా పేర్కొన్నాయి. తన సార్వత్రిక నిధుల సేకరణ కార్యక్రమం కింద అందుకున్న నిధులను కూడా పార్టీ వినియోగించలేకపోయిందని మాకెన్ విలేకరుల గోష్ఠిలో తెలియజేశారు. ఖర్గే, రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్ 'ఎక్స్' పోస్ట్‌లలో ఈ వ్యవహారంపై తమ అభిప్రాయాలు తెలియజేశారు. 'మోడీజీ భయపడకండి. కాంగ్రెస్‌ది ధన వ్యామోహం కాదు కానీ ప్రజల అధికారానికి లోబడింది%ు% మేము నియంతృత్వానికి ఎన్నడూ లొంగిపోలేదు. ఎన్నటికీ లొంగబోము' అని రాహుల్ గాంధీ అన్నారు. 'ప్రతి కాంగ్రెస్ కార్యకర్త భారత ప్రజాస్వామ్యం పరిరక్షణకు నిరంతరం పోరాడతారు' అని రాహుల్ 'దాడి ప్రభావంలో ప్రజాస్వామ్యం' అన్న హ్యాష్‌ట్యాగ్‌తో స్పష్టం చేశారు. సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు భారత్‌లోని అతిపెద్ద ప్రతిపక్షం ఖాతాల స్తంభనకు ప్రభుత్వాన్ని 'అధికారం మత్తు'లో ఉందని ఖర్గే ఆరోపిస్తూ ఇది ప్రజాస్వామ్యంపై 'తీవ్ర దాడి' అని విమర్శించారు. 'కాంగ్రెస్ పార్టీ ఖాతాలనే కాదు, భారత ప్రజాస్వామ్యాన్నే స్తంభింపచేశారు' అని వేణుగోపాల్ ఆరోపించారు.

## కామారెడ్డి డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తివేసిన ప్రభుత్వం



కామారెడ్డి దవాఖానలో ఐసీయూలో రోగిని ఎలుకలు కొరికిన ఘటనకు సంబంధించి ఇద్దరు డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్‌పై సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఎలుకలు కరిచిన ఘటనలో ఈ నెల 11న అసోసియేట్ ప్రొఫెసర్ వసంత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కావ్య, నర్సింగ్ ఆఫీసర్ మంజులను సస్పెండ్ చేస్తూ డీఎంఈ త్రివేణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనపై విచారణకు త్రిసభ్య కమిటీని నియమించారు. మరోవైపు ప్రభుత్వ నిర్ణయంపై వైద్య సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నెల 12న టీచింగ్ హాస్పిటల్స్, జిల్లా దవాఖానాలు, టీవీవీపీ పరిధిలో పనిచేస్తున్న వైద్యులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఘటన జరిగిన సమయంలో హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీలో ఎగ్జామినర్‌గా విధులు నిర్వహించిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంపత్‌పై చర్యలు తీసుకోవడంపై మండిపడ్డారు. రోగికి ఎలుక కరిస్తే శానిటేషన్ ఏజెన్సీ బాధ్యత వహించాల్సి ఉంటుందని, వైద్యసిబ్బంది ఎలా బాధ్యులు అవుతారని నిలదీశారు. తాజాగా కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు అసోసియేట్ ప్రొఫెసర్ వసంత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కావ్య, నర్సింగ్ ఆఫీసర్ మంజులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు డీఎంఈ త్రివేణి ఉత్తర్వులు జారీ చేశారు.

# పేటీఎంకు మరో ఎదురుదెబ్బ..!

## జాబితా నుంచి తొలగించిన ఐహెచ్ఎంసీఎల్..!

పేటీఎం పేమెంట్స్ బ్యాంకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇండియన్ హైవే మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ అధీకృత బ్యాంకుల జాబితా నుంచి పేటీఎం బ్యాంక్‌ను తొలగించింది. ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో ఐహెచ్‌సీఎల్ ఈ నిర్ణయం తీసుకున్నది. తాము ప్రకటించిన 32 బ్యాంకుల నుంచే ఫాస్టాగ్‌లు తీసుకోవాలని సూచించింది. ఈ 32 అధీకృత బ్యాంకుల్లో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్ బ్యాంక్ సహా మరికొన్ని బ్యాంకులున్నాయి. అయితే, భారత్‌లో ఎనిమిది కోట్ల మందికిపైగా 'ఫాస్టాగ్' వినియోగదారులు ఉన్నారని.. ఇందులో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ మార్కెట్ వాటా దాదాపు 30శాతంగా ఉందని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇంతకు ముందు ఐహెచ్‌సీఎల్ గతేడాది జనవరి 19న పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కొత్త ఫాస్టాగ్‌ల జారీని నిలిపివేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఫిబ్రవరి 29 తర్వాత కొత్త అకౌంట్స్, డిపాజిట్లు, క్రెడిట్ ట్రాన్సాక్షన్స్ జరుపొద్దని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, నిబంధనలు పాటించకపోవడంతో ఆదేశాలు జారీ చేసినట్లు సెంట్రల్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉండగా.. ఆర్బీఐ మార్గదర్శకాల మేరకు తాజా ఫాస్టాగ్ కేవైసీ (నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయడానికి 'ఫాస్టాగ్' యూజర్స్‌ను ప్రోత్సహిస్తున్నట్లు ఐహెచ్‌సీఎల్ పేర్కొంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, త్రిసూర్ డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ బ్యాంక్, సౌత్ ఇండియన్ బ్యాంక్, సరస్వత్ బ్యాంక్, నాగ్‌పూర్ నాగరిక్ కో–ఆపరేటివ్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, కరూర్




వైశ్య బ్యాంక్, జేఅండ్‌కే బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఫినో బ్యాంక్, ఈక్విటబుల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, కాస్మోస్ బ్యాంక్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంలకు 'ఫాస్టాగ్' సేవలు అందిస్తున్నాయి. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ సాంకేతికతతో కూడిన 'ఫాస్టాగ్' లింకయిన బ్యాంక్ ఖాతాల నుంచి నేరుగా హైవేటోల్ ఫీజులు చెల్లించేందుకు అవకాశం ఉంటుంది.

## ఆ 160 లోక్‌సభ స్థానాలపై స్పెషల్ ఫోకస్ పెట్టిన బీజేపీ..

## గెలుపు గుర్రాలే టార్గెట్‌గా వ్యూహం

న్యూఢిల్లీ: వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని బీజేపీ భావిస్తోంది. గెలుపే లక్ష్యంగా పార్టీ బలంగా లేని లోక్‌సభ స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా ఏయే నియోజకవర్గాల్లో పార్టీ బలం తక్కువగా ఉందనే దానిపై ఓ జాబితాను సిద్ధం చేసిందని పార్టీ విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గత ఎన్నికల్లో తమ అభ్యర్థులు రెండు లేదా మూడో స్థానానికి పరిమితమైన 160 లోక్‌సభ స్థానాలను బీజేపీ గుర్తించింది. ఆయా స్థానాల్లో ఎన్నిక కోసం బీజేపీ ప్రత్యేక వ్యూహాలను రచిస్తోందని తెలుస్తోంది.

2024 లోక్‌సభ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ సన్నాహాలు ప్రారంభించింది. ఫిబ్రవరి 17, 18వ తేదీల్లో రాజధాని ఢిల్లీలో జరుగనున్న పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో పార్టీ అవలంబించబోయే వ్యూహంపై చర్చించనుంది. మరోవైపు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను కూడా ఖరారు చేసింది. మహాసభల అనంతరం పార్టీ తొలి జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రముఖ నేతల నియోజకవర్గాలలో ఈ సారి బీజేపీ కొత్త వారికి టికెట్లు ఇచ్చేందుకు వ్యూహం రచిస్తోందని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. ఇందులో రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్, కనిమొళి, అభిషేక్ బెనర్జీ, అధీర్ రంజన్ చౌదరి తదితరులపై పోటీకి ముగ్గురు చొప్పున అభ్యర్థుల జాబితాను పార్టీ తయారు చేసిందని తెలిందీ. ఆ ముగ్గురిలో ఒకరిని ఫైనల్ చేసే అవకాశముంది. ముందుగా దక్షిణ భారత రాష్ట్రాల అభ్యర్థుల జాబితాను విడుదల చేయాలని, తెలంగాణలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై మహిళా మోర్చా అధికార ప్రతినిధి నడింపల్లి యమునా పాఠక్‌ను రంగంలోకి దించాలని పార్టీ నాయకులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఎస్. తిరువనంతపురం నుంచి శశి థరూర్‌పై మాజీ క్రికెటర్ శ్రీశాంత్‌ను పోటీకి దింపవచ్చని తెలుస్తోంది.

**కొత్త మిత్రులకోసం తొలి జాబితా లేట్..**

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోయే 62 మంది అభ్యర్థుల పేర్లను జనవరి నెలాఖరులోనే విడుదల చేయాలని బీజేపీ అనుకుంది. కానీ జేడీయూ, అకాలీదళ్, రాష్ట్రీయ లోక్‌దళ్ తిరిగి ఎన్డీయేలోకి చేరే అవకాశం ఉ



ండటంతో కొంత వెనక్కి తగ్గిందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే బిహార్‌లో ఆర్జేడీ మహాకూటమి నుంచి విడిపోయిన నితీశ్ కుమార్ తిరిగి బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. మరో వైపు ఆర్ఎల్డీ చీఫ్ జయంత్ చౌదరి కూడా NDA లో చేరుతున్నట్లు ప్రకటించారు. మరోవైపు అకాలీదళ్ కూడా ఎన్డీయేలో చేరుతుందనే చర్చ జోరుగా సాగుతోంది.

**అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన ఎంపీలకు టికెట్లు కట్?**

మధ్యప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో గతేడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ ఎంపీలు, కేంద్ర మంత్రులను రంగంలోకి దింపి బీజేపీ కొత్త ప్రయోగం చేసింది. 21 మంది ఎంపీలను బరిలోకి దింపగా, అందులో 12 మంది మాత్రమే గెలుపొందారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన ఎంపీలకు మరోసారి అవకాశం ఇస్తుందా ? లేదా ? అనే ప్రశ్నలు ఆ పార్టీ నాయకులకే ఇంకా అంతుపట్టని విషయంగా మిగిలి ఉంది.

# సిఎం రిలీఫ్ ఫండ్ కోసం పెండింగ్‌లో 60వేల దరఖాస్తులు

హైదరాబాద్: వివిధ రకాల అనారోగ్యసమస్యలకు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్)కింద ప్రభుత్వ ఆర్థిక సహాయం కొరుతూ ప్రజల నుంచి వచ్చిన 60వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. శుక్రవారం శాసనసభ సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంటకరెడ్డి మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్‌కోసం వచ్చిన 60వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటన్నింటిని పరిశీలించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యదర్శిని నియమించిందని, త్వరలోనే అన్నింటినీ క్లియర్ చేయనున్నట్టు ప్రకటించారు. అంతకు ముందు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన నియోజకవర్గానికి చెందిన 1200 సిఎంఆర్‌ఫైల్స్ క్లియర్ చేయాలని కోరారు. జీరో అవర్‌లో సభ్యులు వివిధ రకాల సమస్యలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి ప్రభుత్వం తరుపున బలిచ్చారు. గొర్రెల పంపిణీ పథకం కోసం ఎంతో మంది డిడిలు కట్టారన్నారు. ఈ పథకంలో కుంభకోణాలు జరిగాయన్నారు. సరిహద్దుల్లోనే గొర్రెల రీసైక్లింగ్ జరిగాయన్నారు. ఒక ద్విచక్రవాహనంలో 126గొర్రెలను తరలించారని వచ్చిన కథనాలకు సంబంధించి ఆ వాహనం ఎంటో , ఆ తరలింపు ఎలా సాధ్యపడిందో వాటన్నింటిపైన విచారణకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏపిలో తిరుమల దర్శనం కోసం ఎమ్మెల్యే లేఖలు రోజుకు రెండు మూడు ఇచ్చే ఏర్పాటుపై చేయిస్తామన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాజశేఖర్ రెడ్డి హాస్టల్స్‌లో వసతులు కల్పించాలని కోరారు. వందపడకల వైద్యశాలలో తగినంత మంది సిబ్బందిని నియమించాలన్నారు. తెలంగాణకు కొత్తగా వస్తున్న పరిశ్రమలన్నీ హైదరాబాద్ పరిసరాలకే పరిమితమవుతున్నాయని, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో పరిశ్రమలు రాక ఉద్యోగ ఉపాధి లేక యువత పెడదారి పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ విషయంలో తగిన గౌరవం కల్పించాలని కోరారు. దీనిపై మంత్రి కోమటి రెడ్డి బదులిస్తూ సిఎం ఇటీవలే 2000మంది టీచర్ల నియామకాలకు అనుమతి ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ప్రభుత్వ హాస్టళ్లను ఆధునీకరిస్తామని తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తన నియోజకవర్గంలో 111జివోను రద్దు చేసి 69జివో ఇచ్చిన అంశాన్ని ప్రస్తావించారు. ఈ జీవో అమలులో మార్గదర్శకాలను వెల్లడించాలని కోరారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను తొలగించాలని కోరారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ప్రభుత్వ పిజి కాలేజి, పాలిటెక్నిక్ , ఐటిఐ కాలేజిలను ఏర్పాటు చేయాలని కోరారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి జడ్చర్ల పట్టణం చుట్టూ బైపాస్ రోడ్లు నిర్మించాలని కోరారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావిస్తూ సభలో సభ్యులు మాట్లాడే భాష పట్ల అభ్యంతరం వెలిబుచ్చారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి బదులిస్తూ అటువంటి భాష ఏ మాజీ సిఎం కూడా మాట్లారని తెలంగాణ సమాజం దీన్ని హర్షించదంటూ మాజీ సిఎం కేసిర్‌ను ఉద్దేశించి అన్నారు. తెలంగాణ అంటే మర్యాదకు మారుపేరు అని అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే ఎడ్మ కుంచెం ఖానాపూర్‌ను రెవెన్యూడివిజన్‌గా ప్రకటించాలని కోరారు. ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ బొంతు మాధవరెడ్డి , ఆలేరు ఐలయ్య, మదన్‌మోహన్‌రావు , కోరం కనకయ్య, ప్రేమసాగర్‌రావు తదితరులు జీరోఅవర్‌లో తమ నియోజకవర్గాల సమస్యలను సభ దృష్టికి తెచ్చారు.

## అక్కడ 3 రోజులపాటు చికెన్ షాపులు బంద్..

# కలెక్టర్ కీలక నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం రేగింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూతో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడ్డాయి. దాంతో పశుసంవర్ధక శాఖ అధికారులు కోళ్లకు సంబంధించిన శాంపిల్స్‌ను భోపాల్‌లోని టెస్టింగ్ కేంద్రానికి పంపించారు. నెల్లూరులోని చాటగుట్ల, గుమ్మళ్లదిబ్బలో బర్డ్ ఫ్లూ కారణంగా వేల సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. బర్డ్ ఫ్లూతోనే కోళ్ల చనిపోతున్నాయని జిల్లా యంత్రాంగం నిర్ధారణకు వచ్చింది. ఈ నేపథ్యంలో కోళ్లు మృతిచెందిన ప్రాంతానికి పది కిలోమీటర్ల పరిధిలో మూడు రోజుల పాటు చికెన్ షాపులు మూసివేయాలని, కిలోమీటర్ పరిధిలో ఉన్న చికెన్ షాపులు మూడు నెలల పాటు మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. చనిపోయిన కోళ్లను భూమిలో పాతిపెట్టాలని



సూచనలు చేశారు. అలాగే బర్డ్ ఫ్లూపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

## బీఆర్ఎస్ దెబ్బకు ప్రజా భవన్‌కు పరుగులు తీసిన సీఎం రేవంత్ : హరీశ్ రావు

హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడు ప్రజల పక్షాన్నే పోరాడు తుందని మరోసారి రుజువైంది. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న ఫలంగా ప్రజా భవన్‌కు పరుగులు పెట్టడమే తాజా నిదర్శనం. అసెంబ్లీలో బీఆర్ఎస్ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు ప్రజాభవన్ కు వెళ్లాల్సి వచ్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శుక్రవారం



ఆయన మీడియాతో కొద్దిసేపు చిట్‌చాట్‌చేశారు. ప్రతి రోజు ప్రజాభవన్‌కు వెళ్తానని ప్రగల్భాలు పలికిన సీఎం అధికారంలోకి వచ్చాక తొలిరోజు మాత్రమే వెళ్లారన్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com